


నీ హృదయం స్వచ్ఛమై, నీ సంకల్పం స్పష్టంగా ఉంటే, నువ్వు నాకు వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ, మనం ఒకరికొకరం అత్యంత సన్నిహితంగానే ఉంటాం.ఆకాశం వలె, నువ్వు సమస్తానికీ సాక్షివి. ఎటు వంటి కర్మలు జరుగుతున్నా సరే, వాటిని జరగనివ్వు; ఆ కర్మలను ఆచరించేవాడివి నువ్వు కాదు.

– గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ జీ


www.prajadeevena.com

# ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 146 | శుక్రవారం | 27 మార్చి 2026 | పేజీలు : 04 వెల ₹5


విద్యావైద్యం

# మా ప్రాధాన్యతా విధానం

## బోధనాస్పత్రులు అధికారుల చేతికి



ఇందుకు ప్రత్యేకంగా ఓ విభాగం ఏర్పాటు

డాక్టర్లకు కేవలం చికిత్సలు, రోగుల బాధ్యతే

టీచింగ్ కాలేజీలకూ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్

అక్కడి ప్రొఫెసర్లు సర్జరీలు చేస్తే ఇన్సెంటివ్‌లు

మా హయాంలో ఆస్పత్రుల బకాయిలు 127 కోట్లే

గత సర్కారు బకాయిలను కలిపితే రూ.727 కోట్లు

ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సింది 231 కోట్లే

వాటిలో చికిత్సలు చేయడం లేదనేది అపోహే

గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్‌నూ తినేశారు

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ప్రభుత్వ ఆస్పత్రులు, వాటి అనుబంధ వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతను గ్రూప్-1, 2 అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శాసనసభలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. "పెద్ద పెద్ద చదువులు చదువుకున్న డాక్టర్లకు ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతలు ఇస్తే.. ఊడ్చేవాళ్లు.. తుడిచేవాళ్లు.. మిగతా సిబ్బంది వచ్చిన్రా లేదా అని చూసుకోవడానికే సరిపోతోంది. రోగులకు చికిత్స చేయడంతోపాటు నర్సు వచ్చిందా.. వాచ్‌మెన్ వచ్చిండా.. పార్కింగ్ ఎలా ఉంది తదితరాలన్నీ చూసుకోవాల్సి వస్తోంది. వాళ్లు చదువుకున్న చదువుకు, మైండ్ సెట్‌కు, వాళ్ల వ్యవహార శైలికి ఈ బాధ్యత సరిపోదు. చికిత్సను, ఆస్పత్రి నిర్వహణను వేరు చేయాలనుకుంటున్నాం. ఇందుకు ప్రత్యేకంగా ఒక వింగ్ ఏర్పాటు చేస్తాం. ప్రత్యేకంగా గ్రూప్-1, 2 అధికారులను నియమించి నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. రోగులకు చికిత్స బాధ్యతను ప్రొఫెషనల్ డాక్టర్లకు అప్పగించాలనుంటున్నాం" అని ప్రకటించారు. వైద్యాన్ని, ఆస్పత్రుల

మిగతా 2 లో



## నాణ్యమైన పోషకాహారం

అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం

ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సీఎం

## సీఎంఆర్‌కు ప్రత్యేక పాలసీ

ప్రత్యేక సెల్, పోర్టల్, ఆఫీసు ఉండాలి

కంపెనీలు ఇక్కడ.. ఖర్చు మరోచోట అయితే ఎలా!?

రాష్ట్రంలోనే ఖర్చు పెట్టేలా చూడండి: సీఎం



# మార్కాపురం వద్ద మహా విషాదం

## టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 14 మంది సజీవ దహనం, 28 మందికి గాయాలు

టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

జగిత్యాల నుంచి కలిగిరికి స్లీపర్ కమ్ సీటర్

ఆది నుంచీ లోపాలతో ఆగుతూ.. సాగుతూ!

చివరికి మార్కాపురం సమీపంలో ఘోరం

డౌన్‌లో మలుపు తిరుగుతూ కుడివైపునకు..

కంకర లోడుతో వస్తున్న టిప్పర్‌తో ఢీ

బాధితుల్లో అత్యధికులు బేల్దారీలే

ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి వలస

టిప్పర్ డీజిల్ ట్యాంకర్ పగిలి మంటలు

02

మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 14 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి.

# ఆ ప్రతిపాదనను నేనే తిరస్కరించాను

## ఆ దేశ సుప్రీంని చేస్తామన్నారు



04

ఇరాన్ అత్యున్నత పదవి ఇస్తామన్నారు

ఒప్పందం కోసం ఇరాన్ అడుక్కుంటోంది

వాళ్ల మధ్యవర్తుల ప్రవర్తన విచిత్రంగా ఉంది

మాతో చర్చలు జరుపుతూనే..

అలాంటిదేమీ లేదంటున్నారు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

ఇజ్రాయెల్ హిట్‌లిస్టు నుంచి ఇద్దరు ఇరాన్ నేతల మినహాయింపు

దాదాపు నెల రోజులుగా జరుగుతున్న అమెరికా- ఇరాన్ యుద్ధం విరమణ కోసం పరోక్షంగా చర్చలు జరుగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు తదుపరి సుప్రీం లీడర్‌గా తనను నియమిస్తామని చెప్పారని.. కానీ, తాను ఆ ప్రతిపాదనను తిరస్కరించానని వెల్లడించారు.

# భారత నౌకలకు నో ప్రాబ్లం

చైనా, రష్యా, పాక్, ఇరాక్ దేశాలవి కూడా!

మిత్ర దేశాల నౌకలకు అనుమతిస్తున్నాం

ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ వెల్లడి

04





# మోదీ మోస్ట్ పాపులర్

నేడు సీఎంలతో ప్రధాని వర్చువల్ సమావేశం

04

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళిక, సహకారంపై చర్చించనున్నారు.

# భూభారతిలో సరికొత్త సాంకేతికత

ఏప్రిల్ 2 నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి కింద ప్రయోగాత్మకంగా అమలు

ఇబ్బందులు గుర్తించాక మార్పులుచేర్పులు

ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి

ఒక్క క్లిక్‌తో వివరాలు: మంత్రి పొంగులేటి

02



# భద్రాద్రి రామయ్య కళ్యాణానికి రారండోయ్

రేపు మహాపట్టాభిషేకం..

కల్యాణ వేడుకకు హాజరై పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం

రూ.351కోట్లతో భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆలయ అభివృద్ధి మాస్టర్‌ప్లాన్‌ను విడుదల చేసిన తుమ్మల

కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు



02

## దక్షిణ ఆర్‌ఆర్‌ఆర్‌కు సంప్రదింపుల ఏజెన్సీ

మంత్రి కోమటిరెడ్డికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లేఖ

రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి కానుకన్న మంత్రి కోమటిరెడ్డి



02

# విద్యా వైద్యం మాప్రాధాన్యతా విధానం

మొదటి పేజీ తరువాయి

నిర్వహణను వేరు చేయాలని అనుకుంటున్నామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ అంశంపై బీఆర్ఎస్ ఉప నేత హరీశ్ రావుతోపాటు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు గురువారం సీఎం రేవంత్ రెడ్డి జవాబిచ్చారు. "నిధుల సమస్య వస్తే ఇంకెక్కడైనా కోత విధిస్తాం. కానీ, పేదల విద్య, వైద్యం విషయంలో ఒక్క రూపాయి కూడా కోత పెట్టం. విద్య, వైద్యమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం.

ప్రజలకు పోషకాహారాన్ని అందించనున్నాం. నాణ్యమైన, నైపుణ్య విద్యనూ అందిస్తాం. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం" అని తెలిపారు. రాష్ట్రంలోని టీచింగ్ కాలేజీలకు ఆరోగ్యశ్రీ రోగులు రావడం లేదని, రోగులు వెళ్లే ఆస్పత్రుల్లో నిపుణులు లేరని, ఈ సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. టీచింగ్ కాలేజీలకు ఆరోగ్యశ్రీ రోగులను పంపించాలని భావిస్తున్నామని, అప్పుడు అక్కడి విద్యార్థులకూ మరింత అవగాహన పెరుగుతుందని తెలిపారు. టీచింగ్ ఆస్పత్రులకూ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తామని, అక్కడ చికిత్సలు చేసే ప్రొఫెసర్ డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని భావిస్తున్నామని వెల్లడించారు.



### ఆరోగ్యశ్రీ కింద నెలకు రూ.89 కోట్లు

"ఆరోగ్యశ్రీ కింద 2014 నుంచి 2023 డిసెంబరు 6వ తేదీ దాకా ప్రతినెల సగటున గత ప్రభుత్వం రూ.52 కోట్లు ఖర్చు పెట్టింది. మేం గత 27 నెలలుగా ప్రతినెల రూ.89 కోట్లు ఖర్చు పెట్టాం. బకాయిల వారసత్వం వారి (బీఆర్ఎస్) నుంచే వచ్చిందే. వాళ్ల బకాయిల భారాన్ని మోస్తూనే.. ఈ పథకం కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పరిమితిని పెంచాం. మేం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ రూ.2,408 కోట్ల చెల్లింపులు చేశాం. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.927.99 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1480.52 కోట్లు చెల్లించాం. ప్రస్తుతం రూ.727.75 కోట్ల బకాయిలున్నాయి. గత ప్రభుత్వం వదిలి వెళ్లిన బకాయిలు తీసేస్తే.. మా ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.127 కోట్లే. పాత బకాయిలను వదిలించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. వీటిలోనూ ప్రభుత్వ ఆస్పత్రులకే రూ.496 కోట్ల బకాయిలు ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రుల బకాయిలు కేవలం రూ.231 కోట్లు మాత్రమేనని, ప్రైవేట్‌లో బకాయిలు తక్కువేనని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయడం లేదనేది అపోహ మాత్ర మే అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా దుర్వినియోగం చేశారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. 27 నెలల్లో రూ.2,046 కోట్లు సీఎం రిలీవ్ ఫండ్ కింద ఇచ్చామని, ఆరోగ్యశ్రీ కింద ఇచ్చిన రూ.2,400 కోట్లను కలుపుకొంటే పేదల వైద్యానికి రూ.4,500 కోట్లను ఖర్చు చేశామని వివరించారు.

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో విదేశీ వైద్యం

తెలంగాణ నుంచి కొన్ని వేలమంది విదేశాల్లో డాక్టర్లుగా స్థిరపడ్డారని, వాళ్లు తల్లిదండ్రులను చూడడానికో.. జన్మభూమిని చూడటానికో వచ్చినప్పుడు నాలుగైదు రోజులు కుటుంబ వ్యవహారాలు చూసుకున్న తర్వాత ఒక 20 రోజులు అదనంగా ఉంటే.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సకు ఉపయోగించుకునేలా వేదికను తయారు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వారందరి కోసం ఓ వెబ్‌సైట్ తయారు చేస్తున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వారి సేవలను వినియోగించుకునేలా డాక్టర్లతో చర్చించి ఓ కొలిక్కి తెచ్చామని తెలిపారు. ఇక్కడి మెడికల్ కాలేజీలకు వారి అనుభవాన్ని పంచే అవకాశం ఇవ్వనున్నామన్నారు. అలాగే, ఇప్పటిదాకా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సకే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) ఇస్తున్నామని, ఇకముందు టిమ్స్ (ఎల్బీనగర్, అల్వాల్, సనత్‌నగర్), ఉస్మానియా, కాకతీయ మెడికల్ కాలేజీలకు కూడా ఇవ్వనున్నామని వెల్లడించారు. ఆయా ఆస్పత్రులను కూడా బాగు చేసి, ఆరోగ్యశ్రీతోపాటు సీఎం రిలీవ్ ఫండ్ నిధులు ఇవ్వనున్నామని ప్రకటించారు. మంత్రి దామోదర రాజనర్సింహా సామాజిక వైద్యుడని, వైద్యంపై సంపూర్ణ అవగాహన ఉందని, క్వాలిఫైడ్ పర్సనే ఆ శాఖను నిర్వహిస్తున్నారని కితాబునిచ్చారు.

### ఆరోగ్యశ్రీ కింద గ్రీన్ చానల్‌లో నిధులు: రాజనర్సింహా

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద గ్రీన్ చానల్‌లో నిధులు విడుదల చేస్తున్నామని, 1,375 రకాల చికిత్సల ధరలను సవరించామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు. ఏరియా ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రధానంగా కార్డియాలజీకే ప్రతినెల రూ.50 కోట్లు వెచ్చిస్తున్నామని, ఆ తర్వాత ఆంకాలజీ, నెఫ్రాలజీ ఉన్నాయన్నారు. టీచింగ్ ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నామని, 90 శాతం దాకా చికిత్సలు జిల్లా స్థాయిలోనే జరగాలనేది ప్రభుత్వ నిర్ణయమని తెలిపారు.

### బకాయిలు చెల్లించాలి: హరీశ్ రావు

బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు అందించిన ఆస్పత్రులు మూతపడే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ పక్ష ఉపనేత హరీశ్ రావు అన్నారు. గ్రీన్ చానల్‌లో ఆరోగ్యశ్రీ నిధులు చెల్లిస్తామని చెప్పినా.. ఇప్పటిదాకా అమలు చేయలేదన్నారు. ఆరోగ్యశ్రీ మంచి పథకమని, గత ప్రభుత్వం దీన్ని రద్దు చేయకుండా కొనసాగించిందని, ప్రభుత్వం తక్షణమే బకాయిలు చెల్లించాలన్నారు.'

### వైద్య సేవలకే డాక్టర్లు పరిమితం

బోధనాస్పత్రులను ఇప్పటి వరకూ అదనపు వైద్య విద్య సంచాలకుల హోదా (అడిషనల్ డీఎంఈ) ఉన్న సీనియర్ వైద్యులే నిర్వహిస్తున్నారు. అప్పటి దాకా వైద్యం చేసి, పదోన్నతులు రావడంతో ఒక్కసారిగా మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లు అవుతున్నారు. దీంతో వారికి పాలన వ్యవహారాలపై పట్టు చిక్కడం లేదు. రోజూవారీ వ్యవహారాలను కూడా చక్కబెట్టలేకపోతున్నారని ప్రభుత్వానికి నివేదికలు వచ్చాయి. గత రెండేళ్లలో చోటు చేసుకున్న ఘటనలే ఇందుకు ఉదాహరణ. వార్డుల్లోకి ఎలుకలు రావడం, కుక్కలు తిరగడం, శానిటేషన్ సరిగ్గా లేకపోవడం వంటి ఘటనలు నిత్యం జరుగుతున్నాయి. ఒకవైపు వైద్య సేవలందిస్తూనే మరోవైపు పాలన వ్యవహారాలను చక్కబెట్టడం సూపరింటెండెంట్లకు తలకు మించిన భారంగా మారింది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా అందాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతను అధికారులకు అప్పగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. అధికారులు పారిశుద్ధ్యం, రక్షణ, రోగుల భద్రతతోపాటు రోజూవారీ పాలన వ్యవహారాలు చూస్తారని, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది విధులు, సర్జరీలు, ఇతర వైద్య సేవల వ్యవహారాలన్నీ సూపరింటెండెంట్లే పర్యవేక్షిస్తారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

## నాణ్యమైన పోషకాహారం

### అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం

### ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సీఎం

రాష్ట్రంలో ప్రతీ చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఆ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశామని వివరించారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. అసెంబ్లీలోని శాసనమండలి హాల్‌లో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి సీతక్కతో కలిసి చర్చించారు. తెలంగాణలో పదేళ్లలోపు పిల్లల్లో పోషకాహారం, విద్యాభ్యాస స్థాయి, సామర్థ్య లోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారాన్ని అందించేందుకు ఇప్పుడున్న సిబ్బందికి అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ సూచించగా, పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. కార్తీక్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలుచేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. కార్తీక్‌తో సమన్వయం చేసుకుని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# సీఎంఆర్‌కు ప్రత్యేక పాలసీ

### ప్రత్యేక సెల్, పోర్టల్, ఆఫీసు ఉండాలి

### కంపెనీలు ఇక్కడ.. ఖర్చు మరోచోట అయితే ఎలా!?

### రాష్ట్రంలోనే ఖర్చు పెట్టేలా చూడండి: సీఎం

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల సమీకరణతోపాటు సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే సంస్థలను ప్రభుత్వం తరపున అభినందించాలని సూచించారు. సీఎస్ఆర్ నిధులపై గురువారం శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం సమీక్షించారు. ఏటా అత్యుత్తమ భాగస్వామ్యం పంచుకున్న సంస్థల ప్రతినిధులను అభినందించడానికి రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రస్థాయిలో సీఎస్ఆర్ సెల్‌ను, ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఎస్ఆర్ నిధులతో కార్పొరేట్ కంపెనీలు చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టుల వివరాలను సమన్వయం చేసే బాధ్యతను ఈ సెల్ నిర్వర్తిస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా పోర్టల్‌ను రూపొందించాలని ఆదేశించారు. జాతీయ స్థాయిలో సీఎస్ఆర్ విరాళాల వాటా మన రాష్ట్రంలో కేవలం 3 శాతం మాత్రమే ఉందని అధికారులు సీఎంకు నివేదించారు. దాంతో, ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ఆర్ నిధులు ఆశించిన స్థాయిలో లేవని, కంపెనీలు, పరిశ్రమలను తెలంగాణలో ఏర్పాటు చేసి, సీఎస్ఆర్ నిధులను మాత్రం వేరే చోట ఖర్చు పెడితే ఎలా? అని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ వచ్చేలా చూడాలని నిర్దేశించారు. ఇతర రాష్ట్రాల్లో వీటి సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ వాటాను పెంచుకునేందుకు వీలుగా కొత్త పాలసీ ఉండాలని, కార్పొరేట్ సంస్థలను ఆకర్షించే విధానాలను అనుసరించాలని చెప్పారు.

### ఎంఎంటీఎస్ ప్రయాణికులు తగ్గుతున్నారేం: సీఎం

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. ఎంఎంటీఎస్లో ఏటికేడు ప్రయాణికుల సంఖ్య తగ్గుముఖం పడుతుండడంపై ఆయన ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసన మండలి హాల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. "కార్యాలయాల సమయంలో ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్య పెంచాలి. సమయ పాలనతో నడపాలి. స్టేషన్ల దగ్గరకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేదు. కనక అక్కడికి రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడపాలి" అని సూచించారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని నిర్దేశించారు. చిట్టచివరి వరకూ కనెక్టివిటీతోపాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతుల మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

# దక్షిణ ఆర్ఆర్ఆర్‌కు సంప్రదింపుల ఏజెన్సీ

### మంత్రి కోమటిరెడ్డికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లేఖ

### రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి కానుకన్న మంత్రి కోమటిరెడ్డి



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అంశంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్గం నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు ఎన్‌హెచ్ఏఐ ఓ కన్సల్టెన్సీని నియమించింది. డీపీఆర్ ప్రక్రియ కొనసాగుతోందని, డీపీఆర్ వచ్చాకా తదుపరి చర్యలు తీసుకుంటామని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డికి ఓ లేఖ రాశారు. కేంద్ర మంత్రి మార్చి 3న రాసిన ఆ లేఖ.. సచివాలయంలోని ఆర్ అండ్ బీ శాఖ కార్యాలయానికి గురువారం అందిందని.. ఆ కార్యాలయం తెలిపింది. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయాలని కోరుతూ 2025 ఆగస్టు5న మంత్రి కోమటిరెడ్డి తమకు ఇచ్చిన లేఖను కూడా పరిగణనలోకి తీసుకున్నామని కేంద్ర మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రం చేసిన ఈ ప్రకటనతో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం ప్రాజెక్టు కేంద్రమే చేపట్టనుందని స్పష్టమవుతోంది. కాగా, కేంద్రం లేఖకు స్పందించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేంద్రం శుభవార్త చెప్పిందంటూ మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం తాను రాసిన లేఖను పరిగణనలోకి తీసుకున్న నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు చెప్పారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం ప్రస్తుతం టెండరు దశలో ఉండడం, దక్షిణ భాగం విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించడంతో పూర్తిస్థాయి రీజినల్ రింగ్ రోడ్డు సాకారమవుతుందని మంత్రి కోమటిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిర్మించబోయే ఆర్ఆర్ఆర్ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కాబోతుందని హర్షం వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రానికి ఆర్ఆర్ఆర్‌ను మంజూరు చేసినప్పుడు కేంద్రం ఖరారు చేసి అలైన్‌మెంట్ ప్రకారం దక్షిణ భాగం 189 కిలోమీటర్లు ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత చేసిన మార్పుల వల్ల 11 కిలోమీటర్ల దూరం పెరిగి ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం 201 కిమీలకు చేరింది. అనంతరం కేంద్రం సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆ మార్గం డీపీఆర్ రూపొందించి 2026 ఫిబ్రవరి 25న కేంద్రానికి పంపింది. చౌటుప్పల్ దగ్గర ప్రారంభమయ్యే ఈ రోడ్డు భువనగిరి, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల మీదుగా సంగారెడ్డి వరకు ఉండనుంది. ఈ భాగం నిర్మాణం కోసం దాదాపు 2010 హెక్టార్ల భూమి అవసరంపడుతోందని డీపీఆర్‌లో పేర్కొంది. అయితే మళ్లీ ఇప్పుడు దక్షిణ భాగం డీపీఆర్ కోసం కన్సల్టెన్సీని నియమించామంటూ కేంద్రం చెప్పగా.. రాష్ట్రం పంపిన డీపీఆర్‌ను పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొత్త డీపీఆర్ గతంలో మంజూరు చేసిన 189 కిమీల మేర ఉంటుందా? లేక రాష్ట్రం ప్రతిపాదించిన 201 కిమీల మార్గానికి ఉంటుందా?అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదు

### పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**ప్రజా దీవెన, హైదరాబాద్:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల సరఫరా సమృద్ధిగా ఉందని, కొరత లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. రాష్ట్రంలో సగటున రోజుకు 5,883 కిలో లీటర్ల పెట్రోలు, 7,348 కిలో లీటర్ల డీజిల్ సరఫరా అయ్యేదని, కానీ బుధవారం(మార్చి 25) ఒక్క రోజే 10,800 కిలో లీటర్ల పెట్రోలు, 11,328 లీటర్ల డీజిల్ సరఫరా చేసినట్టు వెల్లడించారు. రోజుకు 13,231 కిలో లీటర్లు సరఫరా చేయాల్సి ఉండగా…బుధవారం ఒక్క రోజే 22,127 కిలో లీటర్ల పెట్రోలు, డీజిల్ సరఫరా అయ్యాయని పేర్కొన్నారు. ఇక, ఈనెల 25 తేదీన(బుధవారం) మొత్తం 2,19,980 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రోజుకు సగటున 2,15,151 సిలిండర్ల సరఫరా ఉంటుందన్నారు. ఐవోసీఎల్ 93,000 హెచ్‌పీసీఎల్ 75,151 సిలిండర్లు, బీపీసీఎల్ 47,000 సిలిండర్లు సరఫరా చేస్తుందన్నారు. అయితే, ప్రస్తుతం ఐవోసీఎల్ 92,799, హెచ్‌పీసీఎల్ 81,979, బీపీసీఎల్ 45,202 గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్నట్లు తెలిపారు అవసరం లేకుండా సిలిండర్ల ముందస్తు బుకింగ్ చేసుకోవద్దని ప్రజలకు సూచన చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు 24 గంటల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలు 1967కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

# భూభారతిలో సరికొత్త సాంకేతికత

### ఏప్రిల్ 2 నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి కింద ప్రయోగాత్మకంగా అమలు

### ఇబ్బందులు గుర్తించాక మార్పులుచేర్పులు

### ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి

### ఒక్కక్లిక్‌తో వివరాలు: మంత్రి పొంగులేటి



**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్‌ను అందజేస్తామని, ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి ఎంపిక చేసిన ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నారాయణ పేట జిల్లా కోస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కూసుమంచి, కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో దీన్ని అమలు చేస్తామని తెలిపారు. తొలిదశలోని ఇబ్బందులను గుర్తించి, అవసరమైన మార్పులు చేశాక ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తామన్నారు. ఈ నూతన విధానం వల్ల ఒకే క్లిక్‌తో భూముల వివరాలన్నీ తెలుస్తాయని, సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్నీ సేవలు ఒకే గొడుకు కిందకు వస్తాయని, ప్రతి సర్వే నంబరుకు భూధార్ నంబరు ఉంటుందని వివరించారు. రైతులకు పారదర్శకమైన సేవలను అందించడమే లక్ష్యంగా భూ పరిపాలనలో ఈ విధానాన్ని నూతన శకంగా అభివర్ణించారు. సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భూ పరిపాలన సేవలను వేగవంతంగా అందించేందుకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చేలా భూ భారతి పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు వివరించారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను అమలు చేయడం వల్ల భూ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఐదు మండలాల్లో ప్రతి సర్వే నంబరుకు భూధార్ కార్డు కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి భూధార్ నంబరును కేటాయించినట్లు చెప్పారు. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబరు ద్వారా లాగిన్ అయ్యాక అవసరమైన సమాచారం లభిస్తుందన్నారు. సర్వేకు సంబంధించిన సేవలు, సవరణలు, అప్పీళ్లు, రిజిస్ట్రేషన్ సేవలు, సిటిజన్ డ్యాష్‌బోర్డుకు సంబంధించి మై ల్యాండ్ పోర్టుపోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్స్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్ బ్యాక్ వ్యవస్థ, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నంబర్లు, దరఖాస్తుదారు వివరాలు, మ్యుటేషన్, ఈసీ, మార్కెట్ విలువలు, విలేజ్ మ్యాప్, సర్వే నంబర్ల వారీ మ్యాప్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్,, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతిదశలో సంబంధిత వివరాలు సంక్షిప్త సందేశం ద్వారా తెలియజేస్తామన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూళ్లు ఉంటే.. భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కింద తీసుకొచ్చామన్నారు. త్వరలోనే భూభారతి పోర్టల్‌ను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

# భద్రాద్రి రామయ్య కళ్యాణానికి రారండోయ్

### రేపు మహాపట్టాభిషేకం..
### కల్యాణ వేడుకకు హాజరై పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం
### రూ.351కోట్లతో భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కూడా
### ఆలయ అభివృద్ధి మాస్టర్‌ప్లాన్‌ను విడుదల చేసిన తుమ్మల
### కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు



**ప్రజా దీవెన, భద్రాచలం :** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శుక్రవారం జరిగే సీతారాముల కల్యాణోత్సవం, శనివారం జరిగే శ్రీరామ మహా పట్టాభిషేకం కోసం భద్రాద్రి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మిథిలా స్టేడియంలో శిల్పకళాశోభిత కల్యాణ వేదికపై సీతారాముల పరిణయ వేడుక శుక్రవారం అట్టహాసంగా జరగనుంది. కల్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తజనం భారీగా భద్రాద్రికి చేరుకుంటున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. కల్యాణ వేడుక నిర్వహించే మిథిలా స్టేడియంలో భక్తుల కోసం చలువ పందిళ్లు వేశారు. కల్యాణ మండపాన్ని పుష్పమాలలతో అందంగా అలంకరించారు. దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు కల్యాణ ఏర్పాట్లను పరిశీలించారు. గతేడాది మాదిరిగానే కల్యాణ మండప ప్రాంగణంలో ఎండ వేడి నుంచి భక్తులు సేద తీరేందుకు పొగ మంచు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. పలు చోట్ల తాత్కాలిక విశ్రాంతి మందిరాలను ఏర్పాటు చేశారు. 2వేల మందికి పైగా పోలీస్ సిబ్బంది బందోస్తులో ఉన్నారు. దేవస్థానం అధికారులు భక్తుల కోసం 3లక్షల లడ్డూలు, 5లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేశారు. భక్తులకోసం తెలుగు రాష్ట్రాల నుంచి 406 బస్సులను నడుపుతున్నారు.

#### పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి

సీతారాముల కల్యాణ మహోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం అభిజిత్‌లగ్నంలో సీతారాముల కల్యాణం జరుగుతుంది. శనివారం మిథిలా స్టేడియంలోనే కల్యాణ సీతారామచంద్రస్వామికి మహా పట్టాభిషేకాన్ని నిర్వహిస్తారు. ఈ వేడుకకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా హాజరు కానున్నారు. మరోవైపు, భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనులను రూ.586కోట్లతో మూడు దశల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలివిడతలో రూ.351కోట్లతో పనులను చేపట్టనున్నారు. ఈ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. 2027జూలైలో గోదావరి పుష్కరాల నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది.

#### రాబోయే రోజుల్లో భద్రాద్రికి రైల్వే, విమాన సదుపాయాలు

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రానికి ఇప్పటికే పలు జాతీయ రహదారులను అనుసంధానం చేశామని, రాబోయే రోజుల్లో విమాన, రైల్వే సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రిలో శ్రీరామనవమి, సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన నమూనాను(మాస్టర్ ప్లాన్) విడుదల చేశారు. కాగా, భద్రాద్రి ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి 2024 మార్చి 11న ప్రకటన చేశారు.

## భద్రాచలానికి రూ.351 కోట్లు

#### సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

#### రాష్ట్ర ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి సీతారాములవారి ఆశీస్సులతో దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. భద్రాద్రి రామాలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఆలయ అభివృద్ధి కోసం రూ.351 కోట్లను కేటాయించామని ప్రకటించారు. భద్రాద్రి శ్రీరాముని క్షేత్ర ప్రాధాన్యత దేశమంతటికీ చాటేలా నవమి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



## గద్దర్ సతీమణికి భట్టి, పొన్నం పరామర్శ

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** గద్దర్ సతీమణి విమలమ్మను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్పను అడిగి తెలుసుకున్నారు. విమలమ్మ పిత్తాశయంలో రాళ్ల వల్ల కలిగిన వాపుతో ఇబ్బంది పడుతున్నారని, రేడియాలజీ విభాగం ద్వారా పిగ్‌టైల్ క్యాథెటర్ అమర్చినట్టు వైద్యులు పేర్కొన్నారు. వారి వెంట గద్దర్ కుమార్తె సాంస్కృతిక సారథి చైర్మన్ జీవీ వెన్నెల, కుమారుడు సూర్యం ఉన్నారు. విమలమ్మను కుటుంబ సభ్యులు ఈనెల 24న నిమ్స్‌లో చేర్పించారు.

# లోక్‌భవన్‌లో మహాష్టమి వేడుకలు

#### శక్తి స్వరూపిణి అమ్మవారి పూజ.. పూజలో పాల్గొన్న గవర్నర్ దంపతులు




**ప్రజా దీవెన, హైదరాబాద్ :** శ్రీరామ నవమిని పురస్కరించుకుని చైత్ర నవరాత్రి మహాష్టమి వేడుకలు దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారిగా సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లా తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గత 35 సంవత్సరాలుగా తాను ఈ వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నానని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను, ఈ పవిత్ర వేడుకను తొలిసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లోనూ ఈ వేడుకలు తెలంగాణాలో కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. అమ్మవారి శక్తి స్వరూపమైన దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, మనలోని అజ్ఞానం, అహంకారం, దుర్గుణాలను తొలగించుకోవాలని సూచించారు. ఫలహార దీక్ష కేవలం ఆహార నియమం మాత్రమే కాకుండా, మనస్సు, శరీరం, ఆత్మలను శుద్ధి చేసే ఆధ్యాత్మిక పవిత్ర సాధనమని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఆచారాలు నియమశీలత, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. పరస్పర గౌరవం, సహకారం ద్వారా రాష్టాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని సూచించారు. చివరిగా, మహాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వేడుకలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు,మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మల్క కొమురయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్,అదనపు డీజీపీ మహేష్ భగవత్,జిల్లా కలెక్టర్ హరి చందన, రాజ్ భవన్ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు
# క్రీడా పోటీలు

#### 28, 29 తేదీల్లో 'లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్'

#### రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి నిర్వహణ

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యంగా మార్చి 28, 29 తేదీల్లో 'లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2026' నిర్వహిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించి తెలంగాణ శాసన సభ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల అర్గనైజింగ్ కమిటీ చైర్మన్ జూపల్లి కృష్ణారావు, కో-చైర్మన్ వాకిటి శ్రీహరి అధ్యక్షతన గురువారం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఈ నెల 28, 29 తేదీల్లో శాసనసభ, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు.. మొదటి ఎడిషన్ 'లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్--2026'ను నిర్వహిస్తున్నామని చెప్పారు. 28వ తేదీ మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు సభ్యులంతా పాల్గొంటారని వెల్లడించారు. వివిధ క్రీడాంశాల్లో పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రవీంద్ర భారతీలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న క్రీడాపోటీల పోస్టర్‌ను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, విప్‌లు, శాసనసభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు, మంత్రులకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడాశాఖ అధికారులు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.

#### అసెంబ్లీ జరుగుతుంటే ఆటలేంటి?: కేటీఆర్

కీలకమైన పద్దులపై చర్చలు కొనసాగుతున్న తరుణంలో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించడమేంటని ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మీడియాతో చిట్‌చాట్‌లో ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. సీరియస్‌గా సభ జరుగుతున్న సమయంలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ఏంటని ప్రశ్నించిన కేటీఆర్.. ఇదే విషయాన్ని తాను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వద్ద ఎటువంటి సమాధానం లేదని విమర్శించారు.

### కడియం శ్రీహరి, సంజయ్‌కు
# హైకోర్టు నోటీసులు

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్‌కుమార్‌లపై అనర్హత వేటు వేయాలని, వారికి అనుకూలంగా స్పీకర్ ఇచ్చిన తీర్పును కొట్టేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్‌లు గురువారం హైకోర్టు డివిజన్ బెంచ్ ఎదుట విచారణకు వచ్చాయి. ఈ పిటిషన్‌లలో వివరణ ఇవ్వాలని స్పీకర్, శ్రీహరి, సంజయ్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, తెల్లం వెంకట్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరికెపూడి గాంధీలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌లో బుధవారమే నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే. తాజాగా కడియం శ్రీహరి, సంజయ్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లో నోటీసులు జారీ అయ్యాయి. మొత్తం 9 మంది ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పిటిషన్లు దాఖలు చేసింది. అన్ని పిటిషన్‌లను బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. దానంకు వ్యతిరేకంగా ఇప్పటికే దాఖలు చేసిన పిటిషన్‌తో కలిపి వింటామన్న ధర్మాసనం.. విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది.

## జీవోలను ఎందుకు బహిర్గతం చేయట్లేదు?:హరీశ్

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 19,604 జీవోలు ఇచ్చారని, వీటిని ఎందుకు ఆన్లైన్ చేయట్లేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శాసనసభలో ప్రశ్నించారు. 80 శాతానికి పైగా జీవోలను సీక్రెట్‌గా పెట్టారని, జీవోలను దాయాల్సిన అవసరమేముందన్నారు. ఉద్యోగుల పీఆర్సీపై సభలో చర్చించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ పొడిగింపు మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను 6నెలలకొకసారి ట్రాన్స్‌ఫర్ చేస్తే ఎలా సమన్వయం చేసుకుని బాధ్యతలు నిర్వర్తించగలరని హరీశ్ రావు ప్రశ్నించారు. వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ పన్నులు భారీగా పెంచారని, పొట్టకూటి కోసం ట్రక్కులు, ఆటోలు కొనుక్కునే వారికి భారం అవుతోందన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు మార్చడానికే పోలీసు కమిషనరేట్‌లు మార్చారని హరీశ్‌రావు ఆరోపించారు.

## దావోస్ పర్యటనలతో 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

#### 68,150 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు:దుద్దిళ్ల

**ప్రజా దీవెన, హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులకు రెండుసార్లు హాజరై రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా 68,150 మందికి ఉద్యోగాలు లభించనున్నట్టు చెప్పారు. దావోస్ పర్యటనల్లో భాగంగా మొత్తం 44 ఎంవోయూలను ప్రభుత్వం కుదుర్చుకున్నట్టు వివరించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో హరీశ్‌రావు, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2024 పర్యటనలో 18 ఎంవోయూల ద్వారా రూ.40,232 కోట్లు, 2025లో 26 ఎంవోయూల ద్వారా రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు వివరించారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులు పెడుతున్న 6 కంపెనీలకు భూముల కేటాయించామని, తద్వారా ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం లభించిందని తెలిపారు. ఎంవోయూలు, పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పెట్టుబడులపై విపక్షాలు విష ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. దావోస్ పర్యటనలు, ఇతర సందర్భాల్లో చేసుకున్న ప్రతి ఎంవోయూను గ్రౌండింగ్ చేసందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పాంజ్ ఐరన్ ఓర్ ఫ్యాక్టరీని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు.

## ఐఆర్‌జీసీ నౌకాదళ కమాండర్ అలీరెజా మృతి

**ప్రజా దీవెన, న్యూఢిల్లీ :** తమ దాడుల్లో ఐఆర్‌జీసీ నావికాదళం కమాండర్ అలీరెజా టాంగ్సిరి మృతిచెందినట్టు ఇజ్రాయెల్ గురువారం ప్రకటించింది. ఇరాన్ రేవుపట్టణమైన బందర్ అబ్బాసలో చేసిన వైమానిక దాడుల్లో ఆయనతోపాటు ఇరాన్ నేవీకి చెందిన కీలక అధికారులు కూడా మరణించినట్టు తెలిపింది. అలీరెజా టాంగ్సిరి సుమారు పదేళ్లుగా ఆధునికీకరణ, సరికొత్త సాంకేతికతల వినియోగంతో ఐఆర్‌జీసీ నావికా దళాలను బలోపేతం చేశారు. చిన్న నౌకల ద్వారా డ్రోన్ల ప్రయోగించే వ్యవస్థలను అభివృద్ధి చేయించారు. ఇరాన్ తరపున హోర్ముజ్ జలసంధిని నియంత్రించే కీలక బాధ్యతలను ఆయనే చూసుకుంటున్నారు. జలసంధి మూసివేత, నౌకలపై నిఘా, దాడులు, సముద్రపు మందుపాతరల(సీమైన్స్) ఏర్పాటు, వాణిజ్య నౌకల ప్రయాణానికి అనుమతులు వంటివన్నీ అలీరెజా పర్యవేక్షించారని ఇజ్రాయెల్ రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో కాల్పుల విరమణ కోసం మధ్యవర్తిత్వ ప్రయత్నాల్లో భాగంగా.. అమెరికా, ఇరాన్ మధ్య సందేశాలను చేరవేస్తున్నామని పాక్ విదేశాంగమంత్రి ఇషాక్‌దార్ వెల్లడించారు. తుర్కియే, ఈజిప్టతోపాటు మరికొన్ని దేశాలు సహకరిస్తున్నాయని తెలిపారు.


## నిర్మల్ జిల్లాలో ఏసీబీ దాడులు

#### రెడ్ హ్యాండెడ్‌గా పట్టు బడ్డ సబ్ ఇన్స్పెక్టర్

**ప్రజా దీవెన, నిర్మల్:** నిర్మల్ జిల్లా మామడలో నిశ్శబ్దంగా సాగుతు న్న ఒక అవినీతి కథకు ఈరోజు థ్రిల్లింగ్ క్లైమాక్స్ కు చేరింది. ప్రజల కు రక్షణగా నిలవాల్సిన ఒక పో లీస్ అధికారి అదే అధికారాన్ని ఆ యుధంగా మార్చుకుని లంచాల వల వేస్తూ చివరకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కడంతో కథ కంచికి చేరింది. ఇప్పటివరకు గుట్టుగా నడిచిన ఈ వ్యవహారం ఒక్కసారి గా బహిర్గత మై, ప్రజల్లో షాక్‌తో పాటు ఆగ్రహా న్ని రేపుతోంది. "రక్షకుడే భక్షకుడై తే ఎలా అన్న ప్రశ్న ఇప్పుడు అంద రి నోట వినిపిస్తోంది. ఏసీబీ దాడుల పూర్వాపరాలు ఇ లా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా మామ డ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్ట ర్‌గా పనిచేస్తున్న తీగల అశోక్ ఒక భూ వివాదం కేసులో ఫిర్యాదుదా రుకు సహాయం చేస్తానని చెప్పి, "మోసం కేసు నమోదు చేయకుం డా చూస్తాను" అంటూ రూ. 20 వేలు లంచం డిమాండ్ చేశారు. బా ధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అ ధికారులకు తెలియజేయడంతో వారు జాగ్రత్తగా పన్నిన ఉచ్చులో అశోక్ చిక్కుకున్నారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో అశోక్ లంచం స్వీకరిస్తుండగానే ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అతని వద్ద నుం చి రూ. 20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వ హించిన రసాయన పరీక్షల్లో కూడా అతని చేతులకు పాజిటివ్ ఫలితం రావడంతో అవినీతి ఆరోపణలు బ లపడ్డాయి. ఘటనతో అధికార దుర్విని యోగం ఎలా జరుగుతుందో మరో సారి వెలుగులోకి వచ్చింది. ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ఇలాంటి చ ర్యలు ఎంతతీవ్రమో ఈ కేసు చె బుతోంది. ప్రస్తుతం అశోక్‌ను అరె స్టు చేసి కరీంనగర్‌లోని ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుప రుస్తున్నారు. కేసు దర్యాప్తు కొన సాగుతోంది. ఇదిలా ఉండగా ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే, వెం టనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు సమాచారం ఇవ్వాలని మీ వివ రాలు పూర్తిగా గోప్యంగా ఉంచ బ డతాయని అధికారులు బరోసా ఇ స్తున్నారు. అవినీతిని అరికట్టడం ప్రతి పౌరుడి బాధ్యత మీ ఒక్క స మాచారం కూడా పెద్ద మార్పుకు దారితీస్తుందని అధికారులు పే ర్కొంటున్నారు.

# మోదీ మోస్ట్ పాపులర్

## పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్



**న్యూఢిల్లీ, మార్చి 26:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళిక, సహకారంపై చర్చించనున్నారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల తర్వాత సీఎంలతో ప్రధాని సమావేశం కానుండటం ఇదే తొలిసారి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల సీఎంలు ఈ సమావేశానికి దూరంగా ఉంటారు. ఆ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ సమావేశమై సీఎంలతో ప్రధాని సమావేశం వివరాలను తెలియజేస్తారు. కోవిడ్ సమయంలో మాదిరిగా దేశమంతా జట్టుగా ఉంటూ ప్రస్తుత పరిస్థితులను కూడా ఉమ్మడిగా ఎదుర్కొందామని మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

# ఆ ప్రతిపాదనను నేనే తిరస్కరించాను

## ఆ దేశ సుప్రీంని చేస్తామన్నారు.. నేనే తిరస్కరించా

## ఒప్పందం కోసం ఇరాన్ అడుక్కుంటోంది

## వాళ్ల మధ్యవర్తుల ప్రవర్తన విచిత్రంగా ఉంది

## మాతో చర్చలు జరుపుతూనే..అలాంటిదేమీ లేదంటున్నారు

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

## ఇజ్రాయెల్ హిట్‌లిస్టు నుంచి ఇద్దరు ఇరాన్ నేతల మినహాయింపు

**వాషింగ్టన్, మార్చి 26:** దాదాపు నెల రోజులుగా జరుగుతున్న అమెరికా– ఇరాన్ యుద్ధం విరమణ కోసం పరోక్షంగా చర్చలు జరుగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు తదుపరి సుప్రీం లీడర్‌గా తనను నియమిస్తామని చెప్పారని.. కానీ, తాను ఆ ప్రతిపాదనను తిరస్కరించానని వెల్లడించారు. బుధవారం రాత్రి నిర్వహించిన నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ విందులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లు (ఇరాన్) అనధికారికంగా మా ముందు స్పష్టమైన ప్రతిపాదన పెట్టారు. వారి తదుపరి సుప్రీంలీడర్‌గా నన్ను నియమిస్తామని చెప్పారు. కానీ, నాకు ఆ పదవి అవసరం లేదని చెప్పాను' అని పేర్కొన్నారు. ఇరాన్‌తో పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సైనికపరంగా ఇరాన్‌ను ఇప్పటికే పూర్తిగా నాశనం చేశామని, ఇక ఆ దేశం కోలుకునే పరిస్థితి లేదని అన్నారు. 'మనం భారీ విజయం సాధించబోతున్నాం. వాళ్లు భయపడుతున్నారు. అందుకే చర్చలకు వచ్చారు. ఒప్పందం కోసం అడుక్కుంటున్నారు. సొంత ప్రజలనే చంపుకోవాల్సి వస్తుందని భయపడుతున్నారు' అని ట్రంప్ పేర్కొన్నారు.

### చర్చలు జరుపుతూనే.. లేదంటున్నారు

ఇరాన్ తమతో చర్చలు జరుపుతూనే.. బయటకు మాత్రం అలాంటిదేమీ లేదని ఖండిస్తోందని ట్రంప్ విమర్శించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఆయన ఓ పోస్టు పెట్టారు. 'ఇరాన్ ప్రతినిధులు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. డీల్ కోసం ఒకవైపు మమ్మల్ని అడుక్కుంటూ.. బయటకు మాత్రం అమెరికా ప్రతిపాదనల కోసం ఎదురుచూస్తున్నామని చెబుతున్నారు. వాళ్ల ప్రకటన పూర్తిగా తప్పు. ఆలస్యం కాకముందే చర్చల గురించి సీరియస్‌గా ఆలోచించుకోవాలి. లేదంటే వారికి మళ్లీ తిరిగి చూసే అవకాశం రాకపోవచ్చు' అని ట్రంప్ హెచ్చరించారు. గురువారం క్యాబినెట్ భేటీకి ముందు నిర్వహించిన మీడియా సమావేశంలోనూ ఆయన ఇదే విధమైన వ్యాఖ్యలు చేశారు. యుద్ధ విరమణ ఒప్పందానికి త్వరపడుతున్నది ఇరానేనని.. తాము కాదని తెలిపారు. వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా అపహరించిన సమయంలో కూడా.. ఆ దేశానికి తానే అధ్యక్షుడిని అవుతానని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లోని కీలక నాయకులందరినీ చంపివేస్తూ వస్తున్న ఇజ్రాయెల్.. ఇద్దరిని మాత్రం మినహాయించినట్లు సమాచారం. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి, ఆ దేశ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఖలీబ్షఫలను తన హిట్‌లిస్టు నుంచి తప్పించినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. పాకిస్థాన్ విజ్ఞప్తితో ఈ ఇద్దరు నేతలను చంపబోమని అమెరికా హామీ ఇచ్చిందని, దీంతో ఇజ్రాయెల్ కూడా వారిని తన హిట్‌లిస్టు నుంచి తప్పించిందని తెలిపింది. ఈ ఇద్దరు నేతలను కూడా చంపివేస్తే చర్చలు జరపడానికి ఇరాన్ తరఫున ఎవరూ ఉండరని చెప్పి పాకిస్థాన్ ఒప్పించిందని అమెరికా అధికార వర్గాలు తెలిపాయి.

# భారత నౌకలకు నోప్రాబ్లం

## చైనా, రష్యా, పాక్, ఇరాక్ దేశాలవి కూడా!

## మిత్ర దేశాల నౌకలకు అనుమతిస్తున్నాం

## ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ వెల్లడి

**టెహ్రాన్, మార్చి 26:** యుద్ధం నేపథ్యంలో చమురు రవాణా జరక్కుండా హోర్ముజ్ జలసంధిని బిగబట్టిన ఇరాన్.. భారత్, చైనా, పాకిస్థాన్, రష్యా, ఇరాక్ సహా తన మిత్రదేశాల నౌకలను ఆ దారిలో అనుమతిస్తున్నట్టు ప్రకటించింది. పాశ్చాత్య మీడియా చెబుతున్నట్టుగా ఆ జలసంధిని తాము పూర్తిగా మూసివేయలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. "హోర్ముజ్ గుండా తమ నౌకలు సురక్షితంగా వెళ్లేలా చూడాలని చాలా దేశాలు విజ్ఞప్తి చేశాయి. వాటిలో మా మిత్రదేశాల నౌకలకు, మరికొన్ని ఇతర కారణాల వల్ల మేము నిర్ణయించుకున్న సందర్భాల్లో కొన్ని నౌకలకు మా సాయుధ దళాలు రక్షణ కల్పించాయి. భారత్‌కు చెందిన రెండు నౌకలు కొన్నిరోజుల క్రితం సురక్షితంగా ఈ మార్గాన్ని దాటాయి. ఒక బంగ్లాదేశ్ నౌక కూడా.. ఈ దేశాలన్నీ (చైనా, రష్యా, పాకిస్థాన్, ఇరాక్, ఇండియా) మాతో మాట్లాడాయి. మాతో సమన్వయం చేసుకున్నాయి. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుంది. యుద్ధం తర్వాత కూడా.." అని ఆయన వివరించారు. అదే సమయంలో.. శత్రుదేశాలు, ఈ యుద్ధంలో పాలుపంచుకుంటున్న దేశాల నౌకలను మాత్రం హోర్ముజ్ గుండా వెళ్లడానికి అనుమతించం. అమెరికా, ఇజ్రాయెల్, ఈ సంక్షోభంలో పాత్ర పోషిస్తున్న కొన్ని గల్ఫ్ దేశాల నౌకలకు క్లియరెన్స్ ఇవ్వబోం. మేం యుద్ధంలో ఉన్నాం. ఇది యుద్ధక్షేత్రం. మా శత్రుదేశ నౌకలను, వారి మిత్రదేశాల నౌకలను అనుమతించడానికి ఎలాంటి కారణమూ లేదు. మిగతావారికి మాత్రం ఇది తెరిచే ఉంటుంది" అని అరాఘ్చీ స్పష్టం చేశారు.

# మార్కాపురం వద్ద మహా విషాదం



**మార్కాపురం :** అది... హరికృష్ణ ట్రావెల్స్ బస్సు! కింద సీట్లు, పైన బెర్తులూ! అరుణాచల్‌ప్రదేశ్‌లో 'ఏఆర్ 20డీ 0487' నంబరుతో రిజిస్టరైంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ జిల్లా జగిత్యాలలో బయలుదేరింది. తెల్లారేసరికి... గమ్యస్థానం నెల్లూరు జిల్లా కలిగిరి చేరాలి. అందులో ఎక్కువమంది ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన వారే ఉన్నారు. అందులోనూ అత్యధికులు తెలంగాణలో స్థిరపడిన భవననిర్మాణ కార్మికులు, వారి కుటుంబ సభ్యులే! గురువారం ఉదయం 5.44 గంటల ప్రాంతంలో బస్సు మార్కాపురం దాటి... పొదిలివైపు వెళ్తోంది. జాతీయ రహదారి... ఎన్‌హెచ్ 565పై ప్రయాణం! మరో 3 గంటల్లో కలిగిరి చేరుతుంది. అప్పటికి బస్సులో ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్‌తో కలిపి మొత్తం 41 మంది ప్రయాణికులున్నారు. బస్సు... రాయవరం సమీపంలోని పలకల గనుల దగ్గర రోడ్డు డౌన్‌కు దిగుతోంది! అక్కడ మలుపు కూడా ఉంది. ఏమయిందో ఏమో... బస్సు డ్రైవర్ యువరాజ్ మలుపు దగ్గర అవసరమైనదానికంటే ఎక్కువగా కుడివైపునకు తిప్పాడు. అదే సమయంలో... ఎదురుగా చీమకుర్తి నుంచి మార్కాపురానికి కంకర లోడుతో టిప్పర్ వస్తోంది. తనకు 'అప్' కావడంతో టిప్పర్ నెమ్మదిగానే కదులుతోంది. బస్సు వేగంగా తనవైపు రావడం చూసి టిప్పర్ డ్రైవర్ కంగారు పడ్డాడు. అది ఇటువైపు వస్తోందంటూ తను స్టీరింగ్‌ను కుడివైపునకు కోశాడు. అంతే... హరికృష్ణ ట్రావెల్స్ బస్సు సరిగ్గా టిప్పర్ మధ్యలో ఉన్న డీజిల్ ట్యాంకర్ దగ్గర ఢీకొట్టింది. ఆ వేగానికి డీజిల్ ట్యాంకర్ బద్దలైంది. టిప్పర్ తిరగబడింది. మంటలు రాజుకుని క్షణాల్లోనే అటు టిప్పర్, ఇటు బస్సు... రెండింటికీ అంటుకున్నాయి. సీట్ కుషన్ల కారణంగా బస్సులో శరవేగంగా మంటలు వ్యాపించాయి.

### అద్దాలు బద్దలు కొట్టుకుని...


ఒక్కసారిగా పెద్ద శబ్దం, మంటలు, పొగ వ్యాపించడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. బెర్తులలో ఉన్నవారు తమ పక్కనే ఉన్న అద్దాలు బద్దలుకొట్టి కిందకు దూకారు. బస్సు వెనుకవైపు అద్దాలు పగలగొట్టి మరికొందరు బయటపడ్డారు. అప్పటికప్పుడు సమయస్ఫూర్తి ప్రదర్శించి 'ఎమర్జెన్సీ ఎగ్జిట్' ద్వారా మరికొందరు కిందికి దిగారు. కిందికి వచ్చిన వారిలో కొందరు ప్రాణాలకు తెగించి మరికొందరిని కాపాడేందుకు సహాయపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది.

### గుర్తుపట్టలేనంతగా...

బస్సులో నుంచి బయటపడలేని అసహాయ స్థితిలో 14 మంది సజీవ దహనమయ్యారు. మంటల్లో పూర్తిగా కాలిపోయిన వారి దేహాలు నల్లటి మాంసపు ముద్దలుగా, గుర్తించడానికి వీలు లేకుండా మారాయి. ఆ మృతదేహాలను మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు వైద్యశాల వద్దకు తరలివచ్చారు. ఆనవాళ్లు కూడా లేకుండా మిగిలిన మృతదేహాలను చూసి కన్నీళ్లు పెట్టారు. డీఎన్‌ఏ నివేదిక వచ్చిన తర్వాత మృతదేహాలను అప్పగిస్తామని... అందుకు మరోరోజు సమయం పడుతుందని పోలీసులు తెలిపారు.

### ఆగుతూ... సాగుతూ!

హరికృష్ణ ట్రావెల్స్ బస్సు ప్రతి రోజూ జగిత్యాలలో బయలుదేరి నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్ మీదుగా కలిగిరికి నడుస్తుంది. బుధవారం సాయంత్రం జగిత్యాలలో కదిలినప్పటి నుంచే బస్సు మొరాయిస్తోందని ప్రయాణికులు తెలిపారు. బయలుదేరే సమయంలోనే సమస్య తలెత్తినట్లు ఓ ప్రయాణికుడు తెలిపారు. తర్వాత ఆర్మూర్ వద్ద బస్సు నిలిచిపోవడంతో... అందరినీ మరో బస్సులోకి మార్చారని, కొద్దిసేపటికి మళ్లీ పాత బస్సునే తెచ్చారని మౌనిక అనే ప్రయాణికురాలు తెలిపారు. బయలుదేరిన తర్వాత బస్సు పలుమార్లు ఆగిందని చెప్పారు. 'బస్సులో ప్రాబ్లం ఉంది' అని డ్రైవర్ కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు... బస్సు స్టీరింగ్ స్ట్రక్ అయ్యిందనే వాదన కూడా వినిపిస్తోంది.



### ఘటన స్థలానికి మంత్రులు

గురువారం క్యాబినెట్ సమావేశం ఉన్నప్పటికీ... ప్రమాదం విషయం తెలిసిన వెంటనే రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, హోంమంత్రి వంగలపూడి అనిత హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరు అక్కడ నెలకొన్న పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యశాలలో చికిత్సపొందుతున్న బాధితులను పరామర్శించారు. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, రవాణాశాఖ కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా, ఇంటెలిజెన్స్ ఐజీ రామకృష్ణ. గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కృష్ణారావు తదితర అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

### ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం సమీపంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్ గ్రేషియా పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ మేరకు పీఎంఓ కార్యాలయం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం మండలం రాయవరం సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ప్రమాదంపై స్పందిస్తూ, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్వయంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

### బస్సు ప్రమాద ఘటనపై రేవంత్ దిగ్భ్రాంతి

మార్కాపురం జిల్లా రాయవరం రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో 13 మంది మృతిచెందడం, 20 మందికి తీవ్రగాయాలు కావడంపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు. నిర్మల్ నుంచి నెల్లూరు వైపు బస్సు వెళుతున్న నేపథ్యంలో మృతిచెందిన, గాయపడిన వారి వివరాలను తెలుసుకో వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివ రాలు సేకరించాలని ఆజ్ఞాపించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ సీఎస్ సాయిప్ర సాద్‌తో ఆయన మాట్లాడారు. ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్సు ప్రమాదంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని, ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయ వరం వద్ద తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, టిప్పర్ ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయ పడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ÷ర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# భార్యాభర్తలుగా నాటకాలు

## దొంగతనాలు చేసేందుకు జట్టుకట్టిన నేపాలీలు

## జూబ్లీహిల్స్ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

**హైదరాబాద్, మార్చి 26 :** హైదరాబాద్‌లో సంపన్నుల ఇళ్లను టార్గెట్ చేసుకుని దోపిడీ చేస్తున్న నేపాలీ గ్యాంగ్ ఆట కట్టించారు పోలీసులు. ఇటీవల జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంట్లో పని మనుషుల్లా నటించి.. ఆ ఇంటికే స్కెచ్ వేసి దాదాపు 2 కోట్ల రూపాయలకు పైగా సొత్తు దోచుకు వెళ్లిన గ్యాంగ్‌ను పట్టుకున్నారు. వారి పేర్లు మహేష్ షాహీ, అప్సర. నిజానికి ఇద్దరికీ సంబంధం లేదు. కానీ.. నేపాల్ నుంచి హైదరాబాద్‌లో అడుగు పెట్టిన ఈ జంట.. చోరీలకు స్కెచ్చేశారు. అందుకోసం తాము భార్యభర్తలం అంటూ నాటకం మొదలు పెట్టారు. సంపన్నుల ఇళ్లను టార్గెట్ చేశారు. అక్కడ పని మనుషులుగా చేరేందుకు ప్రయత్నించారు. చివరకు జూబ్లీహిల్స్ రోడ్ నెం 25లోని ఓబుల్‌రెడ్డి స్కూల్ సమీపంలోని ప్లాట్ నెంబర్ 305లో పింగళి అనిరుధ్‌రెడ్డి, దీపికారెడ్డి దంపతుల ఇంట్లో వారికి ఉద్యోగం దొరికింది. ఇక అక్కడి నుంచి తమ స్కెచ్ అమలు చేసేందుకు ఎదురు చూశారు మహేష్ అండ్ అప్సర. ఇంటి యజమానులు ఎప్పుడెప్పుడు బయటకు వెళ్తుంటారు? ఎప్పుడు తిరిగి వస్తుంటారు? ఇలా ఈ విషయాలపై రెక్కీ నిర్వహించారు. మరోవైపు అనిరుధ్ రెడ్డి, దీపికా రెడ్డి దంపతులు ఊటీ, కూర్గ్ తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో మార్చి 5న వారిద్దరూ ఇంటికి తాళం వేసి వ్యాపారం పనిమీద ఊటీ వెళ్లారు. ఆ ఇంట్లో 45రోజుల క్రితం భార్యాభర్తమంటూ తోటమాలీగా పనిలో చేరిన మహేష్ షాహీ అలియాస్ ప్రకాష్, అప్సర అలియాస్ మాయ.. మరో ముగ్గురు నేపాలీ గ్యాంగ్ సభ్యుల సహకారంతో మార్చి 13న అర్ధరాత్రి తర్వాత కట్టర్స్, రాడ్స్‌తో ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌లోని అల్మారాలను పగలగొట్టి సుమారు రూ.2కోట్ల విలువైన డైమండ్ నెక్లెస్‌లు, రాడో వాచ్‌లు, బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు. ఈ ఘటనలో నిందితులను పట్టుకునేందుకు జూబ్లీహిల్స్ క్రైం పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రత్యేక బృందాలు దేశంలోని పలు నగరాలతో పాటు నేపాల్ సరిహద్దుల్లో మోహరించారు. కాగా చోరీ సొత్తును తలా కొంత పంచుకున్న నిందితులు ఢిల్లీతో పాటు ఇతర నగరాలకు పారిపోయారు. మహేష్ షాహీ, అప్సర పోలీసుల కళ్లుగప్పి సరిహద్దు దాటారు. దాదాపు 10 రోజులు వారికోసం కాపుకాసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నేపాల్ వెళ్లి నిందితులను పట్టుకున్నారు. స్థానిక కోర్టులో వారిని హాజరుపర్చిన అనంతరం విచారించగా చోరీ సొత్తులో కొంతభాగం తీసుకుని నరేష్ అనే వ్యక్తి ఢిల్లీకి వెళ్లాడని తేలడంతో అతడిని సైతం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మహేష్ షాహీ, అప్సర ఇద్దరూ సహజీవనం చేస్తున్నారని.. చోరీ స్కెచ్‌లో భాగంగా భార్యాభర్తలుగా సంపన్నుల ఇంట్లో ప్రవేశిస్తుంటారని పోలీసుల విచారణలో తేలింది. కాగా చోరీలో పాల్గొన్న మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసుల వేట కొనసాగుతోందని తెలుస్తోంది. చోరీ అయిన సొత్తులో కొంత రికవరీ అయినప్పటికీ ఎక్కువ సొత్తు ఇంకా లభ్యం కాకపోవడంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

# కవిత కొత్త పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి

## నేడు నిజామాబాద్ వేదికగా ప్రకటన

## రాజకీయ నిర్ణయాలు ప్రకటించే అవకాశం

**నిజామాబాద్,మార్చి26 :** తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తూ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తన సొంత రాజకీయ పార్టీని ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన నిజామాబాద్ వేదికగానే ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించబోతున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించే అధికారిక సమావేశంలో 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో కొత్త పార్టీని ఆమె ప్రకటించనున్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల తేదీని కూడా అదే వేదిక నుంచి వెల్లడించేందుకు సర్వం సిద్ధమైంది. రాబోయే నెలలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో పార్టీ జెండా, అజెండా , పార్టీ గుర్తును ప్రజల ముందుకు తీసుకురావాలని కవిత భావిస్తున్నారు. ఈ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పెద్ద ఎత్తున చేరికలు ఉండేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కేవలం పార్టీ ప్రకటనకే పరిమితం కాకుండా, కవిత రాబోయే ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే అంశంపై కూడా ఈ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో నిజామాబాద్ ఎంపీగా ఐదేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉండటంతో, అదే పార్లమెంట్ పరిధిలోని బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె బరిలోకి దిగుతారని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. కవిత ఈ కొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకోవడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలలో ఒక్కసారిగా గుబులు మొదలైంది. ముఖ్యంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వంటి నేతలు కవిత నిర్ణయంతో ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కవిత వెంట ఎంతమంది కీలక నేతలు నడుస్తారు, ఎంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఆమె పార్టీలో చేరతారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయంగా ఎదిగే లక్ష్యంతో వస్తున్న ఈ కొత్త పార్టీ, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం

## నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజా దీవెన, నల్లగొండ:** ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణను వేగవం తం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ తన ఛాంబర్ లో రెవె న్యూ, ఇరిగేషన్ అధికారులతో ప్రా జెక్టుల భూసేకరణ పై సమీక్ష స మావేశం నిర్వహించారు. ఉదయ సముద్రం, మాధ ఎడవల్లి, శివన్న గూడెం, అంబ భవాని, డిండి, న క్కలగండి, ఏకేబియర్, పెండ్లిపా కల చింతచెట్టు తండా తదితర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణ పనులను త క్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అ న్ని సాగునీటి మరియు లిఫ్ట్ ఇరి గేషన్ ప్రాజెక్టుల పనులను వేగ వంతంగా పూర్తి చేయాలని సూ చించారు. ప్రాజెక్టుల వారీగా పు రోగతిని సమీక్షిస్తూ, భూసేకరణ, పునరావాసం (=ఉ=), పరిహారం చెల్లింపుల అంశాల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



భూసేకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించి, రైతులకు సమయానికి పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టులు పూర్తయితే వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, రైతులకు ప్రత్యక్ష లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఆర్ ఉ ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని,

పునరావాసం పొందిన కుటుంబాలకు అవసరమైన అన్ని సదుపాయాలు అందించాలన్నారు. విభాగాల మధ్య సమన్వయం పెంపొందించి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ప్రతి వారం పురోగతి నివేదికను సమర్పించాలని, నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్డిఓ రమ ణారెడ్డి, ఇతర అధికారులు, ఇరిగేషన్ అధికారులు హాజర య్యారు.

# సమాచారం ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలి

## స్థానిక సం స్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి



**ప్రజా దీవెన నల్లగొండ టౌన్:** వివిధ శాఖల ద్వారా చేపట్టే రహ దారులు, కాలువల నిర్మాణం విస్త రణ పనుల సమయంలో భూగర్భ ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ దెబ్బతి నకుండా సంబంధిత టెలికాం సం స్థలకు సమాచారం ఇచ్చిన తర్వా తే పనులు చేపట్టాలని స్థానిక సం స్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కలె క్టర్ కార్యాలయంలోని తన చాం బర్లో నిర్వహించిన జిల్లా టెలికాం అడ్వైజర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త పను లు చేపట్టేటప్పుడు ప్రత్యేకించి రహదారుల నిర్మాణం, ఉన్న రహ దారుల విస్తరణ, మురికి కాలువల తవ్వకం వంటి సమయంలో "కాల్ బిఫోర్ యు డిగ్ " మొబైల్ యాప్ లో అప్లోడ్ చేయాలని చెప్పారు. అదేవిధంగా టెలికాం సంస్థలు కొత్త టవర్లు, కేబుల్స్ వేసే సమయంలో పైన పేర్కొన్న యాప్లో అప్లోడ్ చేసి న తర్వాతే వేయాలని, ముఖ్యంగా గ్రామాలలో సర్పంచ్ ద్వారా ప్రజల కు అవగాహన కల్పించాలని అన్నారు. ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ సంస్థలు కొత్త కవర్ల ఏర్పాటు సమయంలో రేడియేషన్ లేని టవర్ల ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఈ -డిస్టిక్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఈ ఫైబర్ జిల్లా మేనేజర్, బిఎస్ఎన్ఎల్, ఎయిర్టెల్, ఐడియా, జియో, ఫైబర్ నెట్వర్క్ కంపెనీల ప్రతినిధులతో పాటు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి ,ము న్సిపల్ కమిషనర్లు ,తదితరులు హాజరయ్యారు.

# ద్వారకుంట గ్రామంలో కలశాలలతో మహిళలు ఊరేగింపు



**ప్రజా దీవెన,కోదాడ:** మండల పరిధిలోని దొరకుంట గ్రామంలో నీ శ్రీ లక్ష్మీ గణపతి పార్వతీ చంద్రమౌళీశ్వర సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరాముని విగ్రహానికి, బొడ్రాయి ముత్యాలమ్మ తల్లి అంకమ్మ తల్లి లకు జలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి పాలకి సురేష్ మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున జలబిందులతో బొడ్రాయి వద్ద నుండి ఊరేగింపుగా బయలుదేరి దేవాలయం లోనీ రాముని విగ్రహానికి జలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీరామనవమి వేడుకలను అంగరంగ వైభవంగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో రామాలయ చైర్మన్ ముంద్రా రంగనాయకమ్మ, పిచ్చయ్య, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ ముఖ్య నాయకులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# టి పి సి సి డిల్ గేట్ లక్ష్మీనారాయణ రెడ్డిని పరామర్శించిన పర్యావరణ ఉద్యమకారులు

**ప్రజా దీవెన, కోదాడ:** ఇటీవల తన మోకాలుకు ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న టీ. పీ. సీ. సీ డెలిగేట్ సభ్యులు , కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మీ నారాయణ రెడ్డిని కోదాడ పట్టణానికి చెందిన పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు లక్ష్మీ నారాయణ గురువారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని మొక్కను బహుకరించారు.. అలాగే ఈ నెల 30 న కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నూతన అధ్యక్షుడి గా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనందున అభినందనలు తెలిపారు. ఆయన వెంట లాయర్ కొండల్ రెడ్డి వార్డు కౌన్సిలర్లు 14వ వార్డు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు ఏడవ వార్డు కౌన్సిలర్ చైతన్య నాయక్ ఉన్నారు.

# సాదాబైనమా దరఖాస్తులను పరిష్కరించాలి

## సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**ప్రజా దీవెన, సూర్యాపేట:** సూర్యా పేట జిల్లాలో పెండింగ్ లో ఉన్న సా దాబైనామ, భూభారతి దరఖాస్తు లను త్వరితగతిన పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీసీ హాల్ నందు జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్ లతో పెండింగ్ సాదాభైనమా, భూభారతి, భూ సమస్యలపై వేబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాలన్న నిబంధనతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలుదారు నుంచి మాత్రమే అఫిడవిట్ తీసుకునేలా జీవో 76ను జారీ చేసినట్లు తెలిపినారు. సాదా బైనామా ద్వారా భూములు అమ్ముకునే సమయంలో అమ్మే వ్యక్తి రికార్డు నందు నమోదు కలిగి ఉండాలని, అదే విదంగా పట్టా భూములను మాత్రమే ప్రాసెస్ చేయాలని సూచించారు. వీటితో పాటు భూమి మీద పొజిషన్ తో పాటు, 5ఎకరాల లోపు భూములు కలిగివున్న వారికీ మాత్రమే పరిష్కరించాలన్నారు. నోటీస్ జారీ చేసి 30 రోజులు పూర్తి అయిన వాటిని పరిష్కరించాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పంచనామా చేయాలని తెలిపారు. చాలన్ కట్టే ముందు ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు సరిచేసుకోవాలని ఆదేశించారు. సాదా బైనమా దరఖాస్తులకు పరిష్కారం తొందరగా పూర్తి చేసి అర్హులైన వారికి 13 (దీ) పట్టాలను జారీ చేయాలని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కారం చూపాలని, అలాగే కోర్టు కేసులు, హైకోర్టులో నమోదైన కేసులకు విధిగా జవాబు ఇవ్వాలన్నారు. అదే విదంగా స్లాట్స్ బుకింగ్ క్యాన్సిల్ చేసుకున్న వారికి రీ పేమెంట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ కింద ఎలక్షన్ మ్యాపింగ్ ఎంట్రీ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫారం - 6,7,8 పెండింగ్ లేకుండా చూడాలని, అదే విదంగా మరణించిన ఓటర్లును జాబితా నుండి తొలగించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్డెంట్లు సాయిగౌడ్, శ్రీలత, సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొ న్నారు.

# మత్స్యకారుల సమస్యల పరిష్కా రానికి కృషి



**ప్రజా దీవెన నల్లగొండ టౌన్:** తెలంగాణలో మత్స్యకారులు ఎ దుర్కొంటున్న సమస్యల పరిష్క రించాలని కోరుతూ అడిషనల్ డైరె క్టర్ వి శ్రీనివాస్ కి తెలంగాణ ము దిరాజ్ జా యింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్, జాక్ స్టేట్ కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్, టి ఎం జాక్ మత్స్యశాఖ స్టేట్ కన్వీ నర్ లోకనబోయిన రమణ ముది రాజ్, రాష్ట్ర కార్యదర్శి బాదెన ల క్ష్మయ్య లు వినతి పత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రంలోని కాల పరిమితి ముగిసిన ప్రాధమిక మ త్స్య పారిశ్రామిక సహకార సం ఘాలకు వెంటనే ఎన్నికలు ని ర్వహించి జిల్లా మత్స్య పారి శ్రామిక సహకార సంఘాలను, రా ష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రా ష్ట్రంలో అమలవుతున్న ఉచిత చే ప పిల్లల పంపిణీ పథకాన్ని ఎత్తివే సి దళారీ వ్యవస్థను తీసివేసి మ త్స్య సొసైటీలకు నేరుగా నగదు బ దిలీ చేయాలన్నారు. ప్రతి సంవ త్సరం ఆలస్యం చేయకుండా జూ లై మాసం లోనే చెరువులలో చేప పిల్లలను పంపిణీ చేయాలన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం టెండర్ లో మత్స్యకారులకు 25% రిజర్వేషన్ కల్పించాలని కోరారు. జిల్లా మత్స్యశాఖ అధికారుల అ క్రమ డిప్యుటేషన్ లను రద్దు చే యాలని, కొన్ని జిల్లాలలో మ త్స్య శాఖ అధికారులకు చేప పిల్లల కాం ట్రాక్టుల్లో వాటాలు ఉన్నట్లు, కొంత మంది అధికారులు ప్రతి వాహనా న్ని స్టాకింగ్ చేయడానికి రేటును వి ధించినట్లు ఆరోపణలు ఉన్నాయి దీనిపై విచారణ చేపట్టాలన్నారు. ఒకే స్థానంలో సంవత్సరాల తర బడి ఉద్యోగంలో ఉన్న మత్స్యశా ఖ ఉద్యోగులను సర్వీసు రూల్స్ ఆధారంగా స్థానచలనం కలి గిం చాలని డిమాండ్ చేశారు.

# నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సతీష్ కుమార్

**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్య క్షుడిగా సతీష్ కుమార్ ఎన్ని క య్యారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన దర్శనం నరసిం హ పై 181ఓట్ల తో గెలుపొందారు. అదేవి ధంగా ఉపాధ్యక్షులుగా పజ్జూరు స్వామిగౌడ్, సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా బచ్చనబో యిన అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సూర్య పెల్లి అమరా వతి, కోశాధికారిగా ఎండీ ఫిరోజ్, క్రీడా కార్యదర్శిగా నారా బోయిన ప్రసన్నకుమార్, లైబ్రరీ సెక్రటరీగా పూల పోయిన రామకృష్ణలు ఎన్ని కయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా మిరియాల భాగ్యమ్మ, దువ్వ గీత, పులిజాల కార్తీక్, నగే ష్ కుమార్, మేడి ప్రగతి, జై రా ములు,పందుల సైదులు, జి. వెం కట్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఎన్నికలకు ఎన్నికల అధికారిగా సయ్యద్ జమాల్, అసి స్టెంట్ ఎన్నికల అధికారులుగా బి. రవి,ఏ వెంకటరెడ్డి లు వ్యవహరిం చారు. నూతన అధ్యక్షుడిగా ఎన్ని కైన సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపు సహకరిం చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తె లిపారు. న్యాయవాదుల సమస్య ల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. అనంత రం నూతన కమిటీ సభ్యులను న్యాయవాదులు పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందిం చారు.

# యుద్ధ వ్యతిరేక ర్యాలీని విజయ వంతం చేయండి



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలని తెలంగాణ జన సమితి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కా ర్యదర్శి గుండెబోయిన నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. యుద్ధ వ్య తిరేక కమిటీ ఆధ్వర్యంలో హైదరా బాద్ లో యుద్ధ వ్యతిరేక ర్యాలీ ని జయప్రదం చేయాలని కోరుతూ న ల్లగొండ జిల్లా జనసమితి జిల్లాకా ర్యాలయశీలో మాట్లాడుతూ అమె రికా గుప్తాధిపత్యం కోసం, చము రు నీరులపై పెత్తనం కోసం సాగిస్తు న్న ఈ అమానుష దాడిని ఖండిం చాలని పిలుపునిచ్చారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. ఇరాన్పై అమెరికా ఇజ్రాయిల్ దేశాల యుద్ధం కార ణంగా భారతదేశంలో ప్రజలు నా నా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే గ్యాస్ కొరత ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్ ,డీజిల్ కొరత ఏర్పడుతుం దనే భయం ప్రజల్లో ఉందని ఆ యన పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలలో ఉన్న కోటి మంది భారతీయులు, 15 లక్షల మంది తెలంగాణ వాసు లు దినదిన గండంగా గడుపుతూ భయాందోళనలతో ఉన్నారని ఆవే దన వ్యక్తం చేశారు. యుద్ధ వ్యతి రేక కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 29 న చార్మినార్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌం డ్ వర్క్ జరిగే శాంతి ర్యాలీకి పెద్ద ఎత్తున ప్రజలు ప్రజాస్వామ్య వా దులు తరలిరావాలని పన్నాల గోపాల్ రెడ్డి కోరారు. ఈ సమా వేశంలో జిల్లా నాయకులు పులి పాపయ్య, లావూరి క్రాంతి కుమా ర్, కే కిరణ్ పాల్గొన్నారు.

# బ్లూ, బ్లాక్, గ్రీన్, షర్ట్స్ కవాతును విజయవంతం చేయాలి

## డాక్టర్ పిడమర్తి రవి



**ప్రజా దీవెన, నల్లగొండ టౌన్:** నల్ల గొండ టౌన్ క్లాక్ టవర్ సెంటర్ తె లంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి కార్యాలయంలో బ్లూబ్లాక్ గ్రీన్ షట్ కవాత్ కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర తొ లి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి హాజరై మాట్లా డుతూ ఏప్రిల్ 14 డాక్టర్ బాబాసా హెబ్ అంబేద్కర్ జయంతిని పుర స్కరించుకొని దళిత, బహుజన, మైనారిటీ, గిరిజనులు అందరూ ఏకమై ఈ కవాతును విజయవం తం చేయాలని పిలుపిచ్చారు. ఈ కవాతు ఎల్బీ స్టేడియం బాబు జగ్జీవన్ రావు విగ్రహం నుంచి డాక్టర్ బాబాసాహేబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం వద్దకు ఈ కవాతు ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫె స్టో లో పెట్టిన విధంగా తెలంగాణ ఉ ద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు పెన్షన్లు కూడా మం జూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎస్సీ రిజర్వేషన్లను 20 శాతం పెంచి అందులో మాది గలకు 12 శాతం రిజర్వేషన్లు ఇ వ్వాలని అన్నారు. బీసీలకు 42 శా తం రిజర్వేషన్లు ఎస్టీలకు 12శా తం, మైనార్టీలకు12 శాతం రిజర్వే షన్లు మలు జరిపాలని కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో తెలంగాణ ఉద్యమకా రులు సంక్షేమ సమితి రాష్ట్ర నా యకులు కురుపాటి సుదర్శన్, మాతంగి అమర్, కత్తుల వంశీ, మాదిగ జేఏసీ యూత్ రాష్ట్ర అ ధ్యక్షులు నక్క మహేష్, కట్టెల శివ, మాదిగ విద్యార్థి యూనివర్సిటీ నాయకులు జోగు గణేష్, దేవర కొండ నరేష్, చందు నాయక్, సతీ ష్, శంకర్ , కత్తుల జైచందన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# జొన్నలగడ్డ గూడెంలో బాలల పరిరక్షణ చట్టంపై అవగాహన సదస్సు



**ప్రజా దీవెన తిప్పర్తి:** జొన్నలగడ్డ గూడెం గ్రామంలో గురువారం మి షన్ వాత్సల్య పథకంలో భాగంగా బాలల పరిరక్షణ చట్టం పై అవగా హన సదస్సు జరిగింది. ఈ కార్య క్రమంలో సర్పంచ్ నామిరెడ్డి అను రాధ, కార్యదర్శి వాసు దేవుడు, ఐ సి పి ఎస్ నుండి విద్య ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రణీత, అంగన్వాడీ టీచర్ జొన్నలగడ్డ వెంకట్ రమణ, రామేశ్వరి, సరస్వతి, జ్యోతి, సుని త గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రామగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ



**ప్రజా దీవెన, శాలిగౌరారం :** మండలం లోని రామగిరి గ్రామం లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకొన్నారు. అధ్యక్షులు గా మొగుళ్ళ శ్రీనివాస్ ను గతంలో ఎన్నుకున్నారు. తాజాగా గ్రామ శాఖ ఉపాధ్యక్షులుగా లోడంగి సైదులు,దీటి కుమార్,ప్రధాన కార్యదర్శిగా ఆకుల యాదయ్య,కార్యదర్శిగా బొడ్డు రాంబాబు,సంయుక్త కార్యదర్శిగా బట్టు మల్లేష్, కోశాధికారిగా నంద్యాల నర్సింహ, యూత్ అధ్యక్షులుగా నిమ్మల శంకర్,గౌరవ సభ్యులుగాఆకుల జయమ్మ, నిమ్మల వీరస్వామి, నంద్యాల సునీత-ప్రకాష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చామల వెంకటరమణా రెడ్డి, లోడంగి మహేష్,ఆకుల శ్రీనివాస్, నిమ్మల కృష్ణమూర్తి, నిమ్మల వీరస్వామి,చిర్రబోయిన పరమేష్, బొడ్డు అవిలయ్య, మొగుళ్ళ రాములు నంద్యాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

## సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సొధాని భూమన్న యాదవ్



**ప్రజా దీవెన, యాదగిరిగుట్ట :** రాష్ట్రంలోని సర్పంచుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన విధంగా కృషి చేయాలి రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సొధాని భూమన్న యాదవ్ అన్నారు. గురువారం ఆయన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదాద్రి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొప్పుల వెంకటరెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ లకు తగిన విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సరిపడా కేటాయించాలని కోరారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా చెల్లించాలని కోరారు. సర్పంచ్ లకు ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా తాము అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ లు అంతా గ్రామాల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. పార్టీలకతీతంగా సర్పంచ్ అంత రాష్ట్ర సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యాదాద్రి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొప్పుల వెంకటరెడ్డి కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడు కొప్పుల వెంకటరెడ్డి, సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టేకుల మంజుల, సంఘం రాష్ట్ర సలహాదారులు కే రవీందర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు తాండ్ర నారాయణస్వామి, నాయకులు, గంగాపురం మల్లేష్, పచ్చిమట్ల మదర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## పెండింగ్లో ఉన్న 8500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి: పులి రాఖి




**ప్రజా దీవెన, కోదాడ:** ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి యస్ యు) ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యా సంస్థల బంద్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు డివిజన్ అధ్యక్షులు పులి రాఖి పాల్గొని మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం పెండింగ్ ఫీజులను విడుదల చేయకపోవడం వలన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వారి మేనిఫెస్టోలో విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థులకు అండదండగా ఉంటామని, పెండింగ్ లో ఉన్న ఫీజులను చెల్లిస్తామని ఫీజులు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు విడుదల చేస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న విద్యార్థులకు న్యాయంగా రావాల్సిన పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ గురించి కనీసం మాట్లాడే పరిస్థితి కూడా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి నేడు 8.2 శాతం బడ్జెట్ కేటాయించటం దేనికి నిదర్శనం అని వారు ప్రశ్నించారు. తెలంగాణ విద్యా కమిషన్ కూడా 18 శాతం నిధులు కేటాయించాలని సూచించినప్పటికీ సగం మాత్రమే బడ్జెట్ కేటాయించడం మూలంగా విద్యార్థులకు ప్రభుత్వ విద్యతో పాటు ఉన్నత విద్యలు చదువుకోలేని పరిస్థితి నెలకొంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పెండింగ్ ఫీజులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు డివిజన్ నాయకులు ఉదయ్, కిరణ్, లక్ష్మణ్, నితీష్ కుమార్, గోపి, నిఖిల్, సురేష్, మహేష్, సంతోష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# టెండర్ల అవకతవకలపై ఫిర్యాదుదారుడికి బెదిరింపులు

## పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన స్థానికుడు అన్నల్ దాస్ వెంకటేష్

**ప్రజా దీవెన, యాదగిరిగుట్ట :** తెలంగాణ తిరుమలగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఇటీవల నిర్వహించిన పలు టెండర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఆలయ ఈవో భవానీ శంకర్ కు ఫిర్యాదు చేసిన స్థానికుడు అన్నల్ దాస్ వెంకటేష్ పై పలువురు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో గురువారం అన్నల్ దాస్ వెంకటేష్ పోలీసులను ఆశ్రయించారు. తనను ఫోన్ లో, ప్రత్యక్షంగా కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తుల నుండి తనకు ప్రాణహానీ ఉందని, తనకు రక్షణ కల్పించాలని, అదేవిధంగా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఇక యాదగిరిగుట్ట దేవస్థానంలో ఇటీవల నిర్వహించిన టెండర్ల విషయంలోకి వెళ్తే.. గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహించిన టెండర్లతో పోల్చితే.. తాజాగా ఇటీవల నిర్వహించిన పలు టెండర్ల వల్ల ఆలయ ఖజానాకు భారీగా గండి పడుతోంది. గత టెండర్లతో పోల్చితే ప్రస్తుత టెండర్ల వల్ల సమకూరే ఆదాయంలో దాదాపు 75 శాతం తగ్గుతోంది. కొండ కింద లక్ష్మీపుష్కరిణి సమీపంలో కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్, వాటర్ బాటిళ్ల అమ్మకాలకు సంబంధించిన టెండర్లు సుమారు రూ.6 లక్షలకు ఖరారు కాగా.. గతంలో వీటి ద్వారా రూ.24 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. అదేవిధంగా, బనియన్లు, లుంగీలు, టవల్స్ టెండర్ల ద్వారా వచ్చే ఆదాయం సుమారు రూ.16 లక్షల నుండి రూ.4.10 లక్షలకు పడిపోయింది. ఆలయ ఆదాయానికి ఇంత భారీ నష్టం వాటిల్లుతున్నప్పటికీ.. అధికారులు టెండర్లను రద్దు చేయకపోగా ఆమోదం తెలిపారు. టెండర్ దారులు, ఆలయ అధికారులు కుమ్మక్కై గతం కంటే తక్కువ ధరకు టెండర్లను ఫైనల్ చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై స్థానిక నివాసి అయిన అన్నల్ దాస్ వెంకటేష్ ఆలయ ఈవో భవానీ శంకర్ కు వ్రతాపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి టెండర్లను రద్దు చేయాలని కోరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న టెండర్లు దక్కించుకున్న సదరు టెండర్ దారులు తనపై బెదిరింపులకు పాల్పడడంతో.. అన్నల్ దాస్ వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను ఫోన్ లో, ప్రత్యక్షంగానూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఫోన్ లో బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల కాల్ రికార్డింగ్స్ పోలీసులకు అందజేశారు. తనకు సదరు వ్యక్తుల నుండి ప్రాణభయం ఉందన్న ఫిర్యాదుదారుడు.. తనకు రక్షణ కల్పించి బెదిరింపులకు పాల్పడిన సదరు టెండర్ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు శ్రీరామనవమి వేడుకలు

## నగరంలో శోభాయాత్రకు భారీగా ఏర్పాట్లు

## యాత్ర మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్,మార్చి26 :** శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. సీతారాంబాగ్ దేవాలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర జరగనుంది. ఈ మార్గంలో వాహనాలకు అనుమతి ఉండదు. శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించనున్నారు. సీతారాంబాగ్, బోయిగూడ కమాన్ నుంచి మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వైపు ట్రాఫిక్ మళ్లించనున్నారు. మంగళ్‌హాట్, గాంధీ విగ్రహం, పురానాపూల్, జుమేరాత్ బజార్ నుంచి వచ్చే వాహనాలను టక్కర్‌వాడీ జంక్షన్ వైపు డైవర్ట్ చేయనున్నారు. ఎంజే బ్రిడ్జ్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలను జుమేరాత్ బజార్ మీదుగా మళ్లించనున్నారు. అబిడ్స్ జీపీఓ, సుల్తాన్ బజార్, కోఠి, అబిడ్స్ ప్రధాన రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేయనున్నారు. బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు హైదరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. సీతారాంబాగ్ టెంపుల్ నుంచి సుల్తాన్‌బజార్ వరకు జరిగే ఈ శోభాయాత్ర మార్గంలో వాహనాలకు మళ్లింపులు అమలు చేస్తారు. ప్రత్యేకంగా బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్రను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సర్వం సిద్ధమయ్యారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు క్రమశిక్షణతో జరుపుకోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కోరారు.

# నేటినుంచి బ్యాంకులకు మూడ్రోజుల సెలవులు

**హైదరాబాద్,మార్చి26 :** బ్యాంకులకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రాబోతున్నాయి . శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు పని చేయవు. శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం సెలవు. అలాగే నాలుగో శనివారం, ఆదివారాల్లో బ్యాంకులు తెరుచుకోవు. దీంతో సోమవారమే బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. చెక్ క్లియరెన్స్‌లు, డాక్యుమెంట్ సబ్మిషన్, ఇతర వ్యక్తిగత సేవల కోసం బ్యాంకులకు వెళ్లాలనుకుంటే సోమవారం వరకు ఆగాల్సిందే.

# మొక్కజొన్న కొనుగోలు చేయండి

## సిపిఎం నాయకుల ధర్నా

**ఖమ్మం,మార్చి26 :** మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చింతకాని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మొక్కజొన్నకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మొక్కజొన్న గింజను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో సీపీఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి గోపాలరావు, సీనియర్ నాయకులు వత్సవాయి రాములు, మద్దిని బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంటపొలాల్లోనే ఏనుగుల తిష్ట

**చిత్తూరు,మార్చి26 :** చంద్రగిరి మండలం, ఎగువ కూచివారిప్లలె పంట పొలాల్లో పగలు కూడా ఏనుగులు తిష్ట వేస్తున్నాయి. దీంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. కొన్ని రోజులుగా ఏనుగుల మంద గ్రామంలోని పంట పొలాలపై పడి బీభత్సం సృష్టిస్తోంది. సాధారణంగా రాత్రి వేళల్లో వచ్చే ఏనుగులు, ఇప్పుడు ఏకంగా పట్టపగలే పొలాల్లో తిష్టవేస్తుండటంతో రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. బుధవారం ఎగువ కూచువారి పల్లె రైతుల పొలాల్లో ఏనుగులు మామిడి తోటలు, ఇతర పంటలను తొక్కి వేయడమే కాకుండా, చెట్ల కొమ్మలను విరిచివేసి భారీ నష్టాన్ని కలిగించాయి. సాగునీటి పైపులను, మోటార్లను సైతం ధ్వంసం చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఏనుగులను అడవిలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# జనగామలో సమస్యలు ఉంటే... ఫోన్ చేయండి

## 1800 425 6605 టోల్ ఫ్రీ నెంబర్

## ప్రకటించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్

## వంట గ్యాస్ సరఫరా, తాగునీటి సరఫరా, ఇలా ముఖ్యమైన ఏ సమస్యలున్నా సరే ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు .




**ప్రజా దీవెన, జనగామ :** జనగామలో ఇటీవలనే నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ తనదైన శైలిలో పనిచేస్తూ ప్రజల సౌకర్యార్థం వారు వారి సమస్యలను ఫిర్యాదు చేయడానికి ప్రత్యేకంగా 1800 425 6605 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాట చేశారు. ఇది అభినందనీయం. గ్యాస్ సరఫరా, అక్రమ ఇసుక తరలింపు, తాగునీటి తదితర ప్రధాన సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని, వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచబడుతుందని ప్రజలు ఈ సందర్భంగా గమనించాలి. ఈ విషయంలో రోమింగ్ న్యూస్ అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. జనగామ జిల్లాలో డిజిటల్ పాలనను మరింత సమర్థమంతంగా అమలు చేసేందుకు గాను జిల్లా స్థాయి ఐటీ మానిటరింగ్ సెల్ ను గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించి మాట్లాడారు. గురువారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి ఐటీ మానిటరింగ్ సెల్ ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి ప్రారంభించి ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు . ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ ఐటీ సెల్ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల అమలు, సేవల పంపిణీ, డేటా నిర్వహణలో పారదర్శకత, వేగం పెరుగుతాయని ఆయన వివరించారు .

ఈ ఐటీ మానిటరింగ్ సెల్ సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రజా సేవలు, మద్దతు -- ప్రజలకు వేగవంతమైన, సమర్థమంతమైన సేవలు అందించడం, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు . ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపడటంతో పాటు, ప్రజలకు అందించే సేవల నాణ్యత పెరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు వివిధ రకాల సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ సేవా కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ రిబ్బన్ కత్తిరించి ఆరంభించారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి, తక్షణ పరిష్కారం కోసం 1800 425 6605 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

### ఎల్పీజీ గ్యాస్ సేవలు:

గ్యాస్ బుకింగ్ సమస్యలు, రీఫిల్ ఆలస్యం, భద్రతా అంశాలు, సేవల లోపాలపై ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చు.

### నీటి సరఫరా సేవలు:

పైప్‌లైన్ లీకేజీలు, తక్కువ ఒత్తిడి, నీటి కలుషితం, అసమాన సరఫరా వంటి సమస్యలను తెలియజేయవచ్చు. ఇంకా ఇతరత్రా ముఖ్యమైన సమస్యలు ఉంటే కూడా ఈ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఫణి కుమార్, ఈడీఎం గౌతమ్, ఇతర సంబంధిత అధికారులు, ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ విడుదల



ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ప్రకటించింది. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 20 మ్యాచ్‌లతో కూడిన తొలి దశ షెడ్యూల్‌ను మాత్రమే ప్రకటించిన బీసీసీఐ.. గురువారం మిగిలిన 50 మ్యాచ్‌ల వివరాలను వెల్లడించింది. మార్చి 28 నుంచి మే 24 వరకు లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. మే 31న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ఈ సీజన్‌కు తెరపడనుంది. అయితే ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ఖరారు చేయలేదు. సెకండాఫ్ షెడ్యూల్‌లో 12 వేదికల్లో మొత్తం 50 మ్యాచ్‌లు జరగనుండగా.. ఇందులో 8 డబుల్ హెడర్స్ ఉన్నాయి. డబుల్ హెడర్స్ ఉన్న రోజున మధ్యాహ్నం 3:30 గంటలకు ఒక మ్యాచ్, రాత్రి 7:30 గంటలకు రెండో మ్యాచ్ మొదలవుతుంది. సెకండాఫ్ షెడ్యూల్‌లో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగనుంది. మొత్తంగా హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, న్యూ చండీగఢ్, రాయ్‌పూర్ వేదికల్లో ఐపీఎల్ 2026 మ్యాచ్‌లు జరగనున్నాయి. సెకండాఫ్ షెడ్యూల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మొత్తం 10 మ్యాచ్‌లు ఆడనుంది. ఉప్పల్ వేదికగా మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగనున్నాయి. డేవిడ్ వార్నర్ సారథ్యంలో ఐపీఎల్ 2016 టైటిల్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. 2018, 2024లో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. ఈ సీజన్‌లోనైనా టైటిల్ గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్‌లోనే డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది.

## మరో టైటిల్‌పై సన్‌రైజర్స్ గురి

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో టైటిల్‌పై గురిపెట్టింది. చివరగా ఆరెంజ్ ఆర్మీ డేవిడ్ వార్నర్ సారథ్యంలో 2016లో టైటిల్ అందుకుంది. ఆ తర్వాత 2018, 2024 సీజన్లలో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. గతేడాది పేలవ ప్రదర్శనతో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సారైనా మెరుగైన ప్రదర్శన చేసి టైటిల్ అందుకోవాలనే కసితో ఉంది. అయితే ఫిట్‌నెస్ సమస్యలతో ప్యాట్ కమిన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడం జట్టుకు గట్టి ఎదురుదెబ్బ. విధ్వంసకర బ్యాటర్లతో బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా బౌలింగ్ విభాగం బలహీనంగా ఉంది. ప్యాట్ కమిన్స్ లేని లోటును తీర్చే బౌలర్ ఎవరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అంతేకాకుండా వేలంలోకి వదిలేసిన మహమ్మద్ షమీ స్థానాన్ని భర్తీ చేసే బౌలర్ ఎవరూ జట్టులో కనిపించడం లేదు. దాంతోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 250o పరుగులు చేసినా మ్యాచ్ గెలవలేదని ఆకాశ్ చోప్రా వంటి విశ్లేషకులు బల్ల గుద్ది చెబుతున్నారు. విధ్వంసకర బ్యాటర్లు జట్టులో ఉన్నా.. దూకుడుగా ఆడి ఆల్‌టైమ్ రికార్డు స్కోర్లు నమోదు చేసినా.. జట్టు గెలుస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత సీజన్‌లోనూ పేలవ బౌలింగ్ సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. ప్రాక్టీస్‌లో ఆరెంజ్ ఆర్మీ విధ్వంసకర బ్యాటర్లే దూకుడుగా ఆడి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారనే వాదన కూడా ఉంది. ఈ క్రమంలోనే దూకుడే జట్టుకు బలం, బలహీనతగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన మ్యాచ్‌ల్లో గెలవగా.. స్లో వికెట్స్‌పై ఓటమిపాలైంది. కాస్త నెమ్మదిగా ఉన్న పిచ్‌పై సన్‌రైజర్స్ బ్యాటర్లు తేలిపోతుండగా.. బౌలర్లు పూర్తిగా చేతులెత్తేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకే సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్లను కొనుగోలు చేసింది. స్మరణ్ రవిచంద్రన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్, ప్రఫుల్ హింగె, శివమ్ మావి, సకిబ్ హుస్సేన్, క్రైనిస్ ఫులెట్రా అనే బౌలర్లను కొనుగోలు చేసింది. అయితే ఇందులో మెజార్టీ ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవం లేదు. వీళ్లలో ఏ ఇద్దరు అసాధారణ ప్రదర్శన కనబర్చినా సన్‌రైజర్స్ బౌలింగ్ కష్టాలు తీరుతాయి. లేదంటే జట్టు మరోసారి ప్లే ఆఫ్స్ చేరకుండా అస్సాం ట్రైన్ ఎక్కాల్సిందే.



## పాకిస్థాన్ ఆటగాళ్లపై వార్నర్ ఆగ్రహం



పాకిస్థాన్ ఆటగాళ్లపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ ప్రీమియం ఆటగాళ్లకు కనీస ఇంగిత జ్ఞానం లేదని, ప్రెస్‌మీట్‌లో ఎలా ఉండాలో కూడా తెలియదని అసహనం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్ నేపథ్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డేవిడ్ వార్నర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) 2026 సీజన్‌కు నేడు తెరలేవనుంది. ఈ క్రమంలో బుధవారం లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో కెప్టెన్ల రౌండ్ టేబుల్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ టోర్నీలో కరాచీ కింగ్స్‌కు సారథ్యం వహిస్తున్న డేవిడ్ వార్నర్.. పాక్ ఆటగాళ్ల తీరును తప్పుబడుతూ అసహనం వ్యక్తం చేశాడు. ప్రెస్ మీట్‌లో వార్నర్ తన జట్టు వ్యూహాల గురించి సీరియస్‌గా వివరిస్తుండగా.. పక్కనే కూర్చున్న ఇతర జట్ల కెప్టెన్లు షాహీన్ అఫ్రిది, మహ్మద్ రిజ్వాన్, సౌద్ షకీల్ ఒకరిపై ఒకరు జోకులు పేల్చుకుంటూ నవ్వుకున్నారు. వార్నర్ చెప్పే మాటలను పట్టించుకోలేదు. దాంతో అతను తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. 'అసలు ఇక్కడ ఏం జరుగుతోంది? ఇలా అడుగుతున్నందుకు క్షమించండి. ఇక్కడ కొంతమంది స్కూల్ పిల్లల్లా ప్రవర్తిస్తున్నారు. వీళ్లు తమను తాము ప్రీమియం ప్లేయర్స్ అని పిలుచుకుంటున్నారు. కానీ వీరి ప్రవర్తన మాత్రం చిన్న పిల్లల కంటే అధ్వాన్నంగా ఉంది. ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఎలా ప్రవర్తించాలో కూడా వీరికి తెలియదా?'అని మండిపడ్డాడు. డేవిడ్ వార్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వార్నర్‌ను కొందరు తప్పుబడుతుంటే మరికొందరు సమర్థిస్తున్నారు. అంతర్జాతీయ ప్రెస్ మీట్స్‌లో ప్రొఫెషనలిజం ఉండాల్సిందేనని వార్నర్‌కు మద్దతు తెలుపుతున్నారు. ముఖ్యంగా వార్నర్ లాంటి సీనియర్ ప్లేయర్ మాట్లాడుతున్నప్పుడు తోటి ఆటగాళ్లు గౌరవం ఇవ్వకపోవడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.



## రూ. 16 వేల కోట్లు పలికిన బెంగళూరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే అత్యంత భారీ డీల్ ఒకటి చోటుచేసుకుంది. అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చేతులు మారింది. ఇప్పటివరకు యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ యాజమాన్యంలో ఉన్న ఈ జట్టును, ప్రముఖ వ్యాపార దిగ్గజం ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం కొనుగోలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ భారీ డీల్ విలువ అక్షరాలా 1.78 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 16,000 కోట్లు). ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుండి అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీగా ఇది రికార్డు సృష్టించింది. ఈఎస్పీఎన్ క్రిక్ ఇన్ఫో కథనం ప్రకారం.. ఆర్సీబీ విక్రయ ప్రక్రియలో అనేక బడా కంపెనీలు పోటీ పడ్డాయి. అయితే, ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌లు కలిసి ఒక కన్సార్టియంగా ఏర్పడి అత్యధిక బిడ్ దాఖలు చేసినట్లు సమాచారం. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు ఈ జట్టును సుమారు 111.6 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా, ఇప్పుడు అది 15 రెట్లు ఎక్కువ ధర పలకడం విశేషం. ఆర్సీబీ జట్టుకు ఇప్పటివరకు ఒక్క ఐపీఎల్ టైటిల్ కూడా లభించకపోయినప్పటికీ, ఆ జట్టుకున్న బ్రాండ్ వాల్యూ మరియు ఫ్యాన్ బేస్ అసాధారణం జట్టులో విరాట్ కోహ్లీ ఉండటం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఈ జట్టుకు విపరీతమైన క్రేజ్ ఉంది. "ఈ సారి కప్పు మనదే") అనే స్లోగన్‌తో బెంగళూరు అభిమానులు జట్టుకు ఇచ్చే మద్దతు ఏ జట్టుకైనా అసూయ కలిగిస్తుంది. వ్యాపార పరంగా బెంగళూరు నగరం ఒక పెద్ద హబ్ కావడం, అక్కడ ఉండే స్టేడియం వాతావరణం స్పాన్సర్లకు పెద్ద ఆకర్షణ. ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి దిగ్గజ సంస్థ జట్టు బాధ్యతలు చేపట్టడం వల్ల ఆర్సీబీ వ్యూహాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది. కేవలం మైదానంలో ఆట తీరునే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఆర్సీబీ బ్రాండ్‌ను మరింత విస్తరించాలని కొత్త యాజమాన్యం భావిస్తోంది. అలాగే, జట్టుకు ఎంతో కాలంగా ఊరిస్తున్న 'ఐపీఎల్ టైటిల్'ను ఎలాగైనా గెలవడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని కన్సార్టియం వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ విక్రయంతో ఐపీఎల్ జట్ల విలువ ఒక్కసారిగా ఆకాశాన్ని తాకింది. ఇతర జట్లైన ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ విలువలు కూడా దీనికంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. బిసిసిఐకి కూడా ఈ డీల్ వల్ల భారీ ఆదాయం సమకూరనుంది.

## ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల బ్లాక్ దందా..

### కర్ణాటక ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌కు ముందే బెంగళూరులో టికెట్ల లొల్లి మొదలైంది. మార్చి 28న స్థానిక చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ హై ఓల్టేజ్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల పంపిణీ వ్యవహారం ఇప్పుడు కర్ణాటకలో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. మ్యాచ్ చూసేందుకు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత పాస్‌లు లేదా వీఐపీ టికెట్లు ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ స్థలంలో స్టేడియం నిర్మించుకుని, ప్రభుత్వం నుంచి అన్ని రకాల మౌలిక సదుపాయాలు, ఇతర సహకారాలు పొందుతున్న కేఎస్‌సీఏ కనీసం ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేల కుటుంబాలకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమంటూ ఆయన బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. మార్చి 28న జరిగే తొలి మ్యాచ్ కోసం మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇప్పటివరకు ఎలాంటి టికెట్లు కేటాయించలేదని కాశప్పనవర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సౌకర్యాలు వాడుకుంటూనే తమను కేఎస్‌సీఏ అధికారులు అవమానిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులైన తాము సామాన్యుల్లా క్యూలైన్లలో నిలబడి టికెట్లు కొనుగోలు చేయలేమని తేల్చి చెప్పారు. కాబట్టి ప్రొటోకాల్ ప్రకారం ఒక్కో ఎమ్మెల్యేకు కనీసం ఐదు వీఐపీ టికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వీఐపీల హోదాను దృష్టిలో ఉంచుకుని క్రికెట్ అసోసియేషన్ తగిన విధంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. కేవలం వీఐపీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, టికెట్ల విక్రయాల్లో కేఎస్‌సీఏ భారీ అక్రమాలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు చేశారు. బ్లాక్ మార్కెట్‌లో టికెట్లను యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని విమర్శించారు. అధికారికంగా రూ.5 వేల ధర ఉన్న టికెట్‌ను రూ.35 వేలకు అక్రమంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే టికెట్లు అన్నీ అమ్ముడైపోయినట్లు చూపిస్తున్నారని, దీని వెనుక పెద్ద దందా నడుస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలతో ఈ వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. మరోవైపు సామాన్య క్రికెట్ అభిమానులు సైతం టికెట్ల విక్రయాల్లో పారదర్శకత లోపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి ఆన్‌లైన్‌లో వేచి చూసినా టికెట్లు దొరకడం లేదని ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు టికెట్లు ఎవరికి అమ్ముతున్నారో క్రికెట్ బోర్డు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎమ్మెల్యే చేసిన ఈ తీవ్రమైన ఆరోపణలు, బ్లాక్ మార్కెటింగ్ విమర్శలపై కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరణ ఇవ్వలేదు.



# రామ్‌చరణ్ కంటికి స్వల్ప సర్జరీ

## డాక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిరు






'పెద్ది' సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు.డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు. తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మే-రకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి 'పెద్ది' షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పెద్ది టీమ్ కూడా స్పందించింది. చరణ్ తిరిగి షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టుగా తెలిపింది. గాయం చిన్నదే కావడంతో సినిమా పనులకు పెద్దగా ఆటంకం కలగదని రామ్ చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్ కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

# తెరపైకి మరో రామాయణ కావ్యం

## వాల్మీకి రామాయణ పోస్టర్ విడుదల




భారతీయ ఇతిహాసం రామాయణాన్ని వెండితెరపై మరోసారి ఆవిష్కరించేందుకు సిద్ధమవుతుంది జాతీయ అవార్డు గ్రహీత, దర్శకురాలు భావనా తల్వార్. ఆమె దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'వాల్మీకి రామాయణం'. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ గురువారం విడుదల చేశారు. భక్తి మరియు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ పోస్టర్ ప్రస్తుతం సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శ్రీరాముడి పాదాలను చూపించడం విశేషం. 'పర్వతాలు ఉన్నంత కాలం, నదులు ప్రవహించినంత కాలం రామాయణం జీవించే ఉంటుంది' అనే శక్తివంతమైన క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. చాలా ఏండ్ల తర్వాత భావనా తల్వార్ మెగాఫోన్ పట్టి ఈ సినిమా తెరకెక్కిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తుండగా.. బినోద్ ప్రధాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ అందిస్తున్నాడు. ఆనంద్ నీలకంఠన్ మరియు చంద్రప్రకాష్ ద్వివేది కథను అందిస్తున్నారు. మరోవైపు ఈ భారీ పౌరాణిక చిత్రం గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



## విడాకుల రూమర్లపై క్లారిటీ ఇచ్చిన గ్లోబల్ బ్యూటీ

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా మరోసారి సోషల్ మీడియాలో వస్తున్న డివోర్స్ రూమర్స్‌పై గట్టిగా స్పందించారు. గత కొన్ని సంవత్సరాలుగా తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న ఊహాగానాలపై అసహనం వ్యక్తం చేసిన ఆమె, తాజా ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని క్లియర్‌గా చెప్పేశారు. తనకి, తన భర్త నిక్ జోనాస్ మధ్య ఎలాంటి సమస్యలూ లేవని, తమ వివాహ బంధం చాలా బలంగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. మేము మా జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతున్నామంటూ, బయటేం జరుగుతుందో అంతగా పట్టించుకోమని, కానీ ఎప్పటికప్పుడు డివోర్స్ రూమర్స్ రావడం మాత్రం అర్థం కావడం లేదని, ఎన్ని సార్లు క్లారిటీ ఇచ్చినా, కొందరు కావాలనే ఫేక్ న్యూస్ స్ప్రెడ్ చేస్తున్నారంటూ ప్రియాంక అసహనం వ్యక్తం చేశారు. వేర్వేరు దేశాలు, మతాలు, అలాగే తమ మధ్య ఉన్న ఏజ్ గ్యాప్ వంటి అంశాలను కారణాలుగా చూపిస్తూ రూమర్స్ క్రియేట్ చేయడం సరికాదని ఆమె అన్నారు. తమ ప్రేమ కథ కూడా చాలా ప్రత్యేకమని ప్రియాంక గుర్తుచేశారు. తమకు పరిచయమైన ఆరు నెలల్లోనే పెళ్లి చేసుకున్నామని, ఇప్పటికి ఎనిమిదేళ్లుగా తమ బంధం మరింత బలపడుతూ వచ్చిందని తెలిపారు. నిక్‌ను కలిసిన వెంటనే అతనే సరైన వ్యక్తి అని అనిపించిందని, అతనెంతో నిజాయితీపరుడని, అందుకే మరో ఆలోచన లేకుండా ముందడుగు వేశానని ఆమె చెప్పిన మాటలు వారి రిలేషన్‌లో ఉన్న నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి.

# వివేక్ అగ్నిహోత్రి మూవీ... ఆపరేషన్ సిందూర్



వివాదస్పాద చిత్రాలతో సంచలనం సృష్టించిన దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. 'ఆపరేషన్ సిందూర్' అనే టైటిల్‌తో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం కోసం ఆయన ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్‌తో (టీ-సిరీస్) చేతులు కలిపినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ 'టైనీ' ధిల్లాన్ రాసిన పుస్తకం ఆధారంగా తెరకెక్కుతోంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, భారత సాయుధ దళాలలోని వివిధ విభాగాలు సమన్వయంతో సాగించిన లోతైన పరిశోధనల ఆధారంగా ఈ కథను రూపొందించారు. కేవలం శబ్దం చేయడం కోసం కాకుండా, వాస్తవాలను క్లారిటీతో, సినిమా మాయాజాలంతో ప్రపంచానికి చాటి చెప్పడమే తమ లక్ష్యమని వివేక్ అగ్నిహోత్రి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. పల్లవి జోషి, వివేక్ అగ్నిహోత్రి తమ 'ఐ యామ్ బుద్ధ' ప్రొడక్షన్స్‌పై టీ-సిరీస్‌తో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు

# రణ్‌వీర్ తదుపరి చిత్రంపై ఆసక్తి



'ధురంధర్ 2' బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. 7 రోజుల్లోనే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ స్పై థ్రిల్లర్.. టూ థౌజండ్ క్రోర్ దిశగా దూసుకెళుతోంది. ఈ మూవీ గ్రాండ్ సక్సెస్ తర్వాత రణవీర్ సింగ్ తదుపరి ఏ మూవీ చేయబోతున్నాడన్న ఆసక్తి అందరిలో నెలకొంది. అయితే ధురంధర్ ఊహించని హిట్ తర్వాత పర్హాన్ అక్తర్‌కు హ్యాండిచ్చాడు గల్లీబాయ్. 'డాన్ 3' ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నాడు. అంతకు ముందు సౌత్ దర్శకులు ప్రశాంత్ వర్మ, బాసిల్ జోసెఫ్‌తో కొంత కాలం ట్రావెల్ చేసి.. వాళ్ల టైం, ఎనర్జీని వేస్ట్ చేయించి తర్వాత గుడ్ బై చెప్పిన ఎక్స్‌పీరియన్స్ ఈ హీరోది. బోయపాటి శీను, ఎస్ శంకర్ కూడా రణవీర్ సింగ్‌ను సెట్ చేసేందుకు ట్రై చేస్తున్నారట. కానీ రణవీర్ మాత్రం ఓ బాలీవుడ్ దర్శకుడికి కమిటయ్యాడని తెలుస్తోంది. రణవీర్ నెక్ట్స్ జాంబిస్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. స్కామ్ 1992 అసిస్టెంట్ డైరెక్టర్, లూటేరే సిరీస్ తెరకెక్కించిన జై మెహతా ఈ సినిమాను దర్శకత్వం వహించబోతున్నట్లు తెలుస్తోంది. ప్రళయ్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్లు సమాచారం. లోకతో పాపులారిటీ సంపాదించుకున్న కళ్యాణి ప్రియదర్శన్.. రణవీర్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతోందట. జులై లేదా ఆగస్టు నుంచి ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లనుందని బీటౌన్ టాక్.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA